





# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 271 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ సోమవారం 22 జూన్ 2026 పేజీలు : 12 వెల : 2/-




# ఆరోగ్య ఆంధ్రప్రదేశే లక్ష్యం

- బాబా రామ్‌దేవ్‌తో కలిసి చంద్రబాబు యోగాభ్యాసం
- రాష్ట్రవ్యాప్తంగా 1.33 లక్షల కేంద్రాలలో కోటి మందికి పైగా యోగా సాధన
- రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచుతామని సీఎం ప్రకటన
- ఆగస్టు 15 నుంచి 'సంజీవని' ప్రాజెక్ట్ అమలు
- స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాల్లో శాశ్వత యోగా మందిరాల నిర్మాణం

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో నిర్వహించిన యోగా వేడుకలు అత్యంత ఉత్సాహ భరిత వాతావరణంలో జరిగాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్‌తో కలిసి సామూహిక యోగాభ్యాసంలో పాల్గొన్నారు. ప్రశాంత వాతావరణంలో బాబా రామ్‌దేవ్‌తో కలిసి యోగా చేయడం ఎన్నటికీ మరువలేని అనుభూతిని ఇచ్చిందని ఈ సందర్భంగా సీఎం హర్షం వ్యక్తం చేశారు. యోగాకు అంతర్జాతీయ స్థాయిలో అపారమైన గుర్తింపు తెచ్చి, నేడు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 190 దేశాల్లో ఈ ఉత్సవాలు నిర్వహించేలా చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మోదీ తన చొరవతో ప్రపంచానికి భారతదేశ శక్తులను చాటుతూ, దేశాన్ని అగ్రభాగాన నిలబెడుతున్నారని కొనియాడారు. సాంకేతికత, ఆధ్యాత్మికతల కలయికతోనే సమాజ భవిష్యత్తు ముడిపడి ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఆధ్యాత్మికత, యోగా సాధన ద్వారానే హెల్దీ, వెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ (సుఖీభవ ఏపీ) సాధ్యమవుతుందని చంద్రబాబు మిగతా .. 2లో..

## రెండేళ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్టులు

### సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా, ఈ రెండేళ్లలో సాధించిన విజయాలను ప్రజలకు తెలియజేసేందుకు 'ప్రోగ్రెస్ రిపోర్ట్స్' మిగతా .. 2లో..

## యోగా.. ఐక్యతకు మూలం

### ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ



**కోల్‌కతా, విశ్వం వాయిస్ న్యూస్ :** యోగా ప్రపంచం మొత్తాన్ని ఒకే వేదికపైకి తీసుకొచ్చిందని ప్రధాని మోదీ అన్నారు. 'వయసుతోపాటు ఆరోగ్యానికి యోగా' ఇతివృత్తంతో కోల్‌కతాలోని రెడ్ రోడ్‌లో 35 వేల మందితో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగాతో ప్రపంచ వ్యాప్తంగా ఒకరికొకరు కలిసినట్లయిందన్నారు. కోల్‌కతాలో వేర్వేరు చోట్ల 10 లక్షల మంది యోగాసనాలు వేసేలా ఏర్పాట్లు చేశారు. "జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా యోగా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇవాళ యోగా కార్యక్రమాలతో దేశం మొత్తం చైతన్యంతో నిండిపోయింది. ఇది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదు. కేవలం కొన్ని వయసుల వారికే పరిమితం కాలేదు. ఇది మానవ స్ఫూర్తికి నిదర్శనం. ప్రపంచ వ్యాప్తంగా ఒకరికొకరిని చేరువ చేస్తుంది. అందర్నీ ఏకం చేస్తుంది. జీవనం మరింత సమతులంగా సాగేలా చేస్తుంది. ఏం చేయాలో, ఏం చేయకూడదో నేర్పుతుంది. శక్తిమంతంగా, సౌకర్యవంతంగా ఉంచుతుంది. వ్యాధుల నుంచి దూరంగా ఉంచుతుంది. 20ఏళ్ల కంటే 40 ఏళ్ల వయసులో మరింత దృఢంగా ఉండాలి. ఒత్తిడి రహిత జీవితానికి యోగా దోహదం చేస్తుంది. మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయుక్తం. అందుకే యోగాను కొన్ని సందర్భాలకే పరిమితం చేయకుండా.. నిత్యం సాధన చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. మరింత మెరుగైన ప్రపంచం కోసం యోగా అవసరం" అని మోదీ అన్నారు.

## వైకాపా మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిపై మరో కేసు



**వినుకొండ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** పల్నాడు జిల్లా వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిపై మరో కేసు నమోదైంది. ఈనెల 20న నరసరావుపేట నుంచి వినుకొండకు వైకాపా శ్రేణులతో కలిసి బొల్లా ర్యాలీ నిర్వహించారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఈ క్రమంలో బొల్లా కాన్వాయ్‌ను టౌన్ సీఐ ప్రభాకర్‌రావు అడ్డుకున్నారు. పోలీసులు, వైకాపా కార్యకర్తలకు మధ్య వాగ్వాదంతో మిగతా .. 2లో..

## 6,303 మంది సైబర్ మోసం బాధితులకు రూ.45.21 కోట్లు రిఫండ్




**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రత్యేక లోక్‌అదాలత్ ద్వారా 6,303 మంది సైబర్ మోసం బాధితులకు రూ.45.21 కోట్లు రిఫండ్ చేసినట్లు తెలంగాణ పోలీసులు తెలిపారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో 2,232 మందికి చెందిన రూ.21.91 కోట్లు, సైబర్ సెక్యూరిటీ బ్యూరో పరిధిలో 77 మందికి మిగతా .. 2లో..

## హైదరాబాద్-విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్



**చౌటుప్పల్ గ్రామీణం, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం బొర్రొల్లగూడెం స్టేజీ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున కంటైనర్ వాహనం బోల్తా పడింది. హైవేపై అడ్డంగా వాహనం పడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కంటైనర్‌లో చెన్నై నుంచి హైదరాబాద్‌కు సోలార్ సామగ్రి మిగతా .. 2లో..

## మైనర్‌తో పెళ్లికి రెడీ

### పట్టించిన ప్రీ-వెడ్డింగ్ షూట్

**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవలి కాలంలో వివాహానికి ముందు కాబోయే వధూవరులు ఫొటో షూట్‌లు, రీల్స్ తీసుకోవడం.. వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేసే ట్రెండ్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఓ 15 ఏళ్ల బాలిక వివాహానికి సంబంధించిన ప్రీ-వెడ్డింగ్ షూట్ సామాజిక మాధ్యమాల్లో కనిపించడంతో అప్రమత్తమైన అధికారులు.. వివాహాన్ని అడ్డుకున్నారు. బీడ్ జిల్లా గెవరాయీ మండలానికి చెందిన 23 ఏళ్ల యువకుడికి 15 ఏళ్ల అమ్మాయితో ఇటీవల వివాహం నిశ్చయమైంది. వీరు మిగతా .. 2లో..

## వెంకటాయపాలెం వైయస్సార్ కాపు ఆత్మీయ సమ్మేళనం

### కాపు నాయకుల కీలక తీర్మానాలు




**వెంకటాయపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** వెంకటాయపాలెంలో వైయస్సార్ కాపు ఆత్మీయ సమ్మేళనం అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ నాయకులు తోట త్రిమూర్తులు, బొత్స సత్యనారాయణ, పేర్ని నాని, అంబటి రాంబాబు, కురసాల కన్నబాబు, గుడివాడ అమర్నాథ్ తదితరులు విశేషంగా పాల్గొని ప్రసంగించారు. కాపు సామాజిక వర్గం ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలపై వారు సుదీర్ఘంగా చర్చించి, భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన, ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సమ్మేళనంలో పాల్గొన్న నాయకులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. గత రెండేళ్లుగా కాపు కార్పొరేషన్‌కు నిధులు ఇవ్వకపోవడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. పాత బాకీలతో సహా ఈ ఏడాదితో కలుపుకుని కాపు కార్పొరేషన్‌కు మొత్తం రూ. 9,000 కోట్లు కేటాయించి వెంటనే విడుదల చేయాలని కోరారు. అలాగే గత వైఎస్సార్ ప్రభుత్వం 'కాపు నేస్తం' కింద మహిళలకు సుమారు రూ. 2,000 కోట్లు అందించగా ప్రస్తుత ప్రభుత్వం వారి పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని మహిళలకు జరుగుతున్న ఈ అన్యాయాన్ని వెంటనే అరికట్టాలని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాపులను సంఘ విద్రోహ శక్తులుగా, రౌడీలుగా చిత్రీకరిస్తున్న ప్రభుత్వ కక్షసాధింపు ధోరణిని నాయకులు తీవ్రంగా తప్పుపట్టారు. కాపు సామాజిక వర్గంపై బనాయించిన అక్రమ కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని స్పష్టం చేశారు. సాయి కృష్ణ, క్రాంతి కుమార్‌ల లాకప్ డెత్, ఆత్మహత్యలను సాధారణ ఘటనలుగా పరిగణించబోమని హెచ్చరిస్తూ.. 'రెడ్ బుక్' పేరుతో చంద్రబాబు ప్రభుత్వం సృష్టిస్తున్న అరాచకాలను తీవ్రంగా ఖండించారు. ముఖ్యంగా గాదే సాయి కృష్ణ మృతి ఘటనపై మిగతా .. 2లో..

## యోగా నాకు చాలా ఇచ్చింది

### ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



**విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ యోగాతో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. యోగా తనకు లోతైన స్పష్టతను, అంతర్గత పరిపక్వతను అందించిందని, తన ప్రయాణాన్ని అది ఎంతగానో ప్రభావితం చేసిందని ఆదివారం ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో తన అభిప్రాయాలను పంచుకున్నారు. "భారత నాగరికతలో యోగా ఒక అంతర్భాగం. ప్రపంచానికి భారత్ అందించిన అద్భుతమైన బహుమతి ఇది. శారీరక ఆరోగ్యం, మానసిక స్పష్టత, అంతర్గత సమతుల్యతను యోగా ప్రోత్సహిస్తుంది. ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవనశైలిలో భాగం చేసుకోవాలి" అని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. చిన్న వయసులోనే తాను యోగా ప్రయాణం ప్రారంభించానని ఆయన గుర్తుచేసుకున్నారు. "నా మదిలో ఎన్నో ప్రశ్నలతో సతమతమవుతున్న సమయంలో, యోగా నాకు సమాధానాలు ఇవ్వడమే కాకుండా, ప్రగాఢమైన స్పష్టతను, మిగతా .. 2లో..

## విజయవాడ యువకుడు సాయికృష్ణ కేసు దర్యాప్తునకు సిట్ ఏర్పాటు

### ఐజీ రవి ప్రకాశ్ నేతృత్వంలో దర్యాప్తునకు ప్రభుత్వ ఆదేశం
### సీఎం ఆదేశాలతో వేగవంతమైన దర్యాప్తు, సీఐ నాగరాజు విచారణ



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడలో సంచలనం సృష్టించిన యువకుడి కస్టడీ మృతి ఆరోపణల కేసు దర్యాప్తును ప్రభుత్వం వేగవంతం చేసింది. 25 ఏళ్ల గాదె సాయికృష్ణ అదృశ్యం, కస్టడీ మృతి ఆరోపణలపై విచారణ జరిపేందుకు ఏపీ పోలీస్ శాఖ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. శాంతిభద్రతల విభాగం ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) ఎం.రవి ప్రకాశ్ ఈ సిట్‌కు నేతృత్వం వహించనున్నారు. ఈ ప్రత్యేక దర్యాప్తు బృందంలో పశ్చిమ గోదావరి ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ సభ్యులుగా ఉంటారని, బాపట్ల జిల్లా అదనపు ఎస్పీ ఎల్.సుధాకర్‌ను దర్యాప్తు అధికారిగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. విచారణను మిగతా .. 2లో..

## బోయపాడు తీరంలో కాలుష్యంపై డిప్యూటీ సీఎం ఆరా

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** అనకాపల్లి జిల్లా బోయపాడు తీర ప్రాంతంలో చేపలు మృతి చెందినట్టు వచ్చిన సమాచారంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరా తీశారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శిని ఆదేశించారు. చేపల మృతికి గల కచ్చితమైన కారణాలను అన్వేషించేందుకు శాస్త్రీయ పరిశోధనలు చేపట్టాలని కాలుష్య నియంత్రణ మండలి, మత్స్యశాఖ అధికారులు, మెరైన్ సైంటిస్టులకు సూచించారు. దీనిపై నిపుణులతో క్షుణ్ణంగా అధ్యయనం మిగతా .. 2లో..

## లోదుస్తుల్లో సిమ్, పాత ప్రశ్నపత్రంతో పరీక్షకు.. నీట్ అభ్యర్థి అరెస్టు




**విశ్వం వాయిస్ న్యూస్ :** పకడ్బందీ ఏర్పాట్ల నడుమ ఆదివారం దేశవ్యాప్తంగా నీట్ రీటెస్టు నిర్వహించారు. 20 లక్షలకుపైగా విద్యార్థులు పరీక్ష రాశారు. ఈ క్రమంలోనే ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓ అభ్యర్థి తన లోదుస్తుల్లో సిమ్ కార్డు, నీట్ పాత ప్రశ్నపత్రంతో పట్టుబడ్డాడు. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. నీట్ ఎగ్జామ్ రాసేందుకు ఓ అభ్యర్థి వారణాసిలోని హరిశ్చంద్ర పోస్ట్‌గ్రాడ్యుయేట్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి వచ్చాడు. ఈ సందర్భంగా నిర్వహించిన తనిఖీల సమయంలో భద్రతా సిబ్బందికి అతడి ప్రవర్తనపై అనుమానం వచ్చింది. దీంతో మరింత క్షుణ్ణంగా తనిఖీ చేయగా అతడి లోదుస్తుల్లో దాచి ఉంచిన సిమ్ కార్డు, నీట్ పరీక్షకు సంబంధించిన ఓ పాత ప్రశ్నపత్రం బయటపడ్డాయి. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. ఆ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. తన పేరు ప్రిన్స్ దూబే అని, బలియా మిగతా .. 2లో..

## 'అయోధ్యను వీడి వెళ్లొద్దు'..

### ట్రస్ట్, ఆలయ సిబ్బందికి సిట్ ఆదేశాలు

**విశ్వం వాయిస్ న్యూస్ :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య రామాలయంలో కానుకలు, నిధుల దుర్వినియోగం ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన విచారణను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా అయోధ్యను వీడి వెళ్లొద్దని ఆలయ సిబ్బందిని, ట్రస్ట్ నిర్వాహకులను ఆదేశించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ట్రస్ట్ సభ్యులు తదితరులను విచారించిన వివరాలు, ఇతర అంశాలతో కూడిన నివేదికలను దర్యాప్తు అధికారులు డిజిటల్ రూపంలో భద్రపర్చుతున్నారని, అదే సమయంలో మిగతా .. 2లో..

## ఢిల్లీ చేరుకున్న మంత్రి లోకేష్

### ఘనంగా స్వాగతం పలికిన టీడీపీ ఎంపీలు
### ఏపీ విజన్, పెట్టుబడులపై ప్రసంగించనున్న మంత్రి



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ దేశ రాజధాని ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. జాతీయ స్థాయిలో రెండు ప్రముఖ మీడియా సంస్థలు నిర్వహించే సదస్సులలో పాల్గొనేందుకు మిగతా .. 2లో..

## ఎట్టకేలకు మొదలైన చర్చలు

### మరోవైపు ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా, ఇరాన్‌ల మధ్య యుద్ధం శాశ్వత ముగింపు కోసం స్విట్జర్లాండ్ వేదికగా ఎట్టకేలకు చర్చలు మొదలయ్యాయి. అమెరికా తరఫున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ తరఫున పార్లమెంట్ స్పీకర్ ఘాలిబాఫ్ బృందాలు ఇందులో పాల్గొన్నాయి. పాకిస్థాన్, ఖతార్ ప్రతినిధులు మధ్యవర్తిత్వం వహిస్తున్నారు. అదే సమయంలో మిగతా .. 2లో..

# ఎడిటర్ వాయిస్

## ఏపీకి కులాల దరిద్రం.. అంత సులువుగా పోతుందా?

ఏపీ రాజకీయాలు అంటేనే కులాల సమాహారంగా చెబుతారు. అసలు కులం ప్రస్తావన లేకుండా ఏపీలో రాజకీయం సాగడం లేదు. అది ఇవాళా నిన్నా వచ్చినది కాదు. 1953 అక్టోబర్ 1న ఉమ్మడి మద్రాస్ స్టేట్ నుంచి ఏపీ విడిపోయినపుడు తొలి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం అయ్యారు. అయితే అతి కొద్ది నెలలలోనే ఆయనను దించేశారు. దాని వెనక బలమైన సామాజిక వర్గం ఆకాంక్షలు ఉన్నాయని చెబుతారు. ఇక ఏపీ నాటి హైదరాబాద్ స్టేట్ విలీనం అయి 1956 రాష్ట్రం ఏర్పడింది. అపుడు కూడా హైదరాబాద్ స్టేట్ తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామక్రిష్ణారావుకి చాన్స్ ఇవ్వనిది బలమైన కులాల ఆశల ఫలితమే అన్నది ఒక విశ్లేషణ.

**కులంతోనే సాగుతోంది :** ఉమ్మడి ఏపీలో చూసుకుంటే ఒకసారి దళిత ముఖ్యమంత్రికి చాన్స్ వచ్చింది. మరోసారి ఒక బ్రాహ్మణుడికి సీఎం గా అవకాశం వచ్చింది. ఈ రెండు సార్లూ వారిని ఎక్కువ కాలం గద్దె మీద ఉండనీయకుండా చేసినది కుల రాజకీయమే అన్నది చరిత్ర చెబుతున్న సత్యం. ఇక ఏపీలో మూడున్నర దశాబ్దాల పాటు కాంగ్రెస్ ఉమ్మడి ఏపీని ఏలింది. ఒకే కులానికి అగ్ర తాంబూలం ఇస్తున్నారు అని భావించే ఆల్టర్నేషన్ పాలిటిక్స్ అవతరించింది. అలా టీడీపీ పుట్టుకుని వచ్చింది. ఇక టీడీపీలో సీఎం లు అయిన వారు కానీ ఆ తరువాత బీఆర్ఎస్ కానీ వైసీపీ కానీ సీఎంలు అయిన వారు ఆయా పార్టీలను అత్యధికులు సొంతం చేసుకున్న సామాజిక వర్గాల నుంచే అన్నది కూడా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

**చిరకాల కోరికగా :** ఇక ఈ రోజున ఒక బలమైన సామాజిక వర్గంగా కాపులు తమకు ముఖ్యమంత్రి పీఠం ఒక్కసారి అయినా దక్కాలని కోరుకుంటున్నారు. వారి ఆశలకు దారులు వెతుకుతున్న నేపథ్యం కూడా ఉంది. మరో వైపు బీసీల నుంచి సీఎం పదవి కావాలన్నది నినాదంగా ఉంది. ఇక ఎస్సీ ఎస్టీ బీసీ బహుజన ఫ్రంట్ పేరుతో కొత్త రాజకీయ వేదికల సృష్టి వెనక బలమైన సిద్ధాంతాల కంటే తమ సామాజిక వర్గం వారికి రాజకీయ అధికారం దక్కాలని కోరిక బలంగా ఉండడమే అన్నది కూడా ఆలోచించాల్సిన విషయం.

**జనంలో ఉందా :** నిజం చెప్పాలి అంటే మొదట్లో జనంలో ఈ కుల భావన అయితే లేదు, కానీ తమ అవసరాలకు తగినట్లుగా రాజకీయ పార్టీలు ఓట్ల వేట కోసమే కుల భావనను పెంచి పెద్దది చేసి జనాల మీదకు రుద్దారు. ఇపుడు ప్రజలు ఆ కుల భావనలో అమాయకంగా కొట్టుకుని పోతూంటే అది వద్దు అని నేతలు ఇపుడు తాపీగా చెబుతున్నారు. నిజానికి ఇలా చెప్పే నేతలు ఎన్నికల వేళ తమ తమ పార్టీల తరఫున ఇచ్చే టికెట్లను ఒకసారి పరిశీలిస్తే వారు అన్ని సామాజిక వర్గాలను సంతృప్తి పరచాలన్న ఉద్దేశ్యంతోనే ఇస్తున్నారు అన్నది కూడా వాస్తవం. అంతే కాదు నామినేటెడ్ పదవులు ఆఖరుకు ఆలయాలలో దేవుడికి సేవ చేసుకునేందుకు ట్రస్టీ పదవులు అని చెప్పి వాటిని కూడా కులం కొలమానంతోనే చూస్తూ ఇస్తున్న నేపథ్యం ఉంది.

**అల్లుకుపోయిన వైనం :** ఇంతలా కులం అన్నది ఏపీ సమాజంలో అల్లుకుని ఊడలు దిగిపోవడానికి కారణం రాజకీయ పార్టీలదే అన్న విశ్లేషణలు ఉన్నాయి. అంతే కాదు కులం అన్నది ఒక గుర్తింపుగా మార్చి అందలాలు ఎక్కించడం మొదలయ్యాక ఎవరూ ఆ బాట నుంచి సులువుగా తప్పుకునేందుకు సిద్ధంగా ఉండరన్నది కూడా తెలిసిందే. ఈ రోజున కూడా ఇంత కుల భావన ఉన్నా కొన్ని సామాజిక వర్గాలకు రాజ్యాంగ పదవులు దక్కడం లేదు అన్నది కూడా ఆయా వర్గాలలో ఆవేదన ఉంది. బ్రాహ్మణ సామాజిక వర్గం నుంచి ఎమ్మెల్యేలు ఎంపీలు ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎంత అన్నది వారు ప్రశ్నిస్తున్న విషయం. అలాగే ఏపీ కేబినెట్ లో తమకు స్థానం లేదా అని క్షత్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్న వైనం ఉంది.



అలాగే బీసీలలో చాలా ఉప కులాలు ఈ రోజుకీ రాజ్యాధికారం నోచుకోలేదని రోదిస్తున్నాయి. మరి ఇంతలా పెంచి పోషించిన కులాల కుంపటిని మహా సముద్రాలను తెచ్చి ఆర్పడానికి ప్రయత్నాలు చేసినా అవుతుందా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇది మేధావుల బుర్రలను కూడా దొలిచేస్తున్న మాట.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## ఫాదర్స్ డే నాడు ఓ తండ్రికి తీవ్ర శోకం



### ఖమ్మం జిల్లాలో దారుణం

**ఖమ్మం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఫాదర్స్ డే నాడు ఓ తండ్రికి తీవ్ర శోకం ఖమ్మం జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. ఇద్దరు పిల్లలకు ఎలుకల మందు తాగించి, తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన తల్లి. ఇద్దరు కొడుకులు మృతి, తల్లి పరిస్థితి విషమం ఉంది. ఖమ్మం త్రీ టౌన్ పరిధిలోని గాంధీనగర్‌లో ఇద్దరు కుమారులు వేదిక్ కుమార్(7), తనిష్క్(5)లతో లింగరాజు, స్వాతి దంపతులు కలిసి నివాసం ఉంటున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఇద్దరు పిల్లలకు ఎలుకల మందు తినిపించి, తానూ తిని ఆత్మహత్యాయత్నానికి స్వాతి పాల్పడింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు చిన్నారులు మరణించగా, స్వాతి పరిస్థితి విషమంగా ఉంది.

## చెట్టును ఢీకొట్టిన కారు.. భార్యాభర్తలు, కుమారుడి మృతి

**ములకలపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. ములకలపల్లి మండలం మాదారం అటవీ ప్రాంతంలో ఓ కారు చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందగా.. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ములకలపల్లి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. మృతులను భార్యాభర్తలు సాయికుమార్ (25), సంధ్య (23), వారి కుమారుడు మోక్షిత్ (4)గా గుర్తించారు. సాయికుమార్ తల్లి జ్యోతికి తీవ్రగాయాలు కావడంతో ఆమెను పాల్వంచ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ముసలిమడుగు గ్రామానికి చెందిన వీరు.. ఓ వేడుక కోసం ములకలపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది.

## విద్యుదాఘాతంతో బాలుడి మృతి

**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** జీవనోపాధి కోసం స్వగ్రామం వదిలి వలసొచ్చిన నిరుపేద కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. రోడ్డుపై కేరింతలు కొడుతూ ఆటలాడుకుంటున్న పసివాడిని విద్యుత్తు తీగల రూపంలో మృత్యువు కాటేసింది. విశాఖ కొమ్మాది సమీపంలోని సాయిరాం కాలనీలో జరిగిన ఈ ఘటనపై పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా రేగిడి ఆమదాలవలస మండలం ఉప్పర నాయుడు వలస గ్రామానికి చెందిన కురిటి నారాయణరావు, చిన్నమ్మడు దంపతులు పదేళ్ల క్రితం నగరానికి వలస వచ్చారు. ఈ క్రమంలో కొమ్మాది సమీపంలోని సాయిరాం కాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌కు కాపలాదారుగా ఉంటున్నారు. వీరి కుమారుడు కురిటి అఖిల్ (5) కాలనీకి చెందిన మరో ఇద్దరు పిల్లలతో కలిసి ఆదివారం ఉదయం అపార్ట్‌మెంట్ ముందు రోడ్డుపై ఆటలాడుకుంటున్నాడు. ఆ సమయంలో అదే అపార్టుమెంట్ పక్కన భూగర్భ విద్యుత్తు పనులు జరుగుతున్న ప్రదేశంలో వారు ఆడుకుంటున్న బంతి పడింది. దాని కోసం వెళ్లిన అఖిల్‌కు అక్కడ విద్యుత్తు సరఫరా అవుతున్న ఎర్త్ తీగలు తగలడంతో తీవ్రంగా షాక్‌కు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఘటన జరిగిన ప్రదేశాన్ని ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ సింహాచలం నాయుడు, ఏడీఈ కిరణ్‌కుమార్, ఏఈఈ నరేష్ పరిశీలించారు. ప్రమాదం జరగడానికి గల కారణాలను గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

## ఫ్రిజ్ వాటర్ వెంటనే తేలేదని.. కన్నతల్లిని కడతేర్చిన కసాయి కొడుకు

**పిఠాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఫ్రిజ్ వాటర్ అడిగితే.. తొందరగా తేలేదని కసాయి కొడుకు విచక్షణారహితంగా దాడి చేయడంతో అతని కన్నతల్లి చికిత్సపొందుతూ కన్నుమూసిన అమానవీయ ఘటన కాకినాడ జిల్లాలో గగుర్పాటుకు గురిచేసింది. పిఠాపురం మండలం చిత్రాడలో ఈ దారుణం జరిగింది. పోలీసులు కథనం ప్రకారం.. స్థానిక ఈబీసీ కాలనీకి చెందిన పెంటా నాగమణి(45) తన కుమారుడు రాజబాబుకు ఈ నెల 9న మధ్యాహ్నం భోజనం వడ్డించింది. తింటున్న అతడు ఫ్రిజ్‌లోని మంచినీళ్లు తెమ్మన్నాడు. కాస్త ఆలస్యం కావడంతో కోపోద్రిక్తుడైన రాజబాబు అరుస్తూ ఫ్రిజ్ దగ్గరకు వెళ్తూ గుమ్మానికి ఢీకొని గాయపడ్డాడు. విచక్షణ కోల్పోయిన అతడు అదే సమయంలో మంచినీళ్లిచ్చిన తల్లి తలను పూజ గదిలోని చెక్క బల్లకేసి కొట్టాడు. తీవ్ర రక్తస్రావంతో ఆమె నేలపై పడిపోయింది. ఇంతలో ఇంటికొచ్చిన ఆమె భర్త త్రిమూర్తులు, బంధువులు 108కి ఫోన్ చేసి అంబులెన్స్‌లో కాకినాడలోని ప్రభుత్వాసుపత్రి (జీజీహెచ్)కి తీసుకువెళ్లారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న నాగమణి ఆరోగ్యం విషమించడంతో ఆదివారం ఉదయం మృతిచెందింది. పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్సై లోకేశ్ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

### కందికుప్పలో పిడుగుపాటుకు

## రెండు పాడి గేదెల మృతి



**కందికుప్ప, విశ్వం వాయిస్ న్యూస్ :** కాట్రేనికోన మండలం కందికుప్పలో ఆదివారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షానికి పిడుగు పడి కూరాకుల మల్లేశ్వరరావు అనే రైతుకు చెందిన రెండు పాడి గేదెలు మృతి చెందాయి. పాల వ్యాపారంపైనే ఆధారపడి జీవిస్తున్న ఆ కుటుంబం ఈ ఘటనతో ఒక్కసారిగా జీవనాధారం కోల్పోయింది. తీవ్ర ఆర్థిక నష్టాన్ని చవిచూసిన తమను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## మసూరీలో టెకీ రాధా గాయత్రి మృతి



### భర్తపై హత్యాయత్నం కేసు

**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉత్తరాఖండ్‌లోని మసూరీలో అనుమానాస్పదరీతిలో మృతిచెందిన టెకీ రాధా గాయత్రి కేసులో ఆమె భర్త శ్రీచరణ్‌పై అక్కడి పోలీసులు చర్యలు చేపట్టారు. మృతురాలి తండ్రి సుధాకర్ ఫిర్యాదు మేరకు భర్తపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. రాధా గాయత్రిని మానసికంగా ఒత్తిడి చేసినట్లు, మరణానికి కారణమయ్యే మందులు వాడినట్లు గుర్తించారు. భార్య కుటుంబసభ్యులకు శ్రీచరణ్ తప్పుడు సమాచారం ఇచ్చినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. గురుగ్రామ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్న శ్రీచరణ్, రాధాగాయత్రి ఇటీవల ఉత్తరాఖండ్‌లో టూర్‌కి వెళ్లారు. ఈనెల 14న మసూరీలోని హోమ్‌స్టేలో ఉన్నారు. అక్కడ రాధా గాయత్రి మృతిచెందారు. ముక్కు నుంచి రక్తం వచ్చినట్లు మసూరీ పోలీసులు గుర్తించారు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి రాధా గాయత్రి తండ్రి ఫిర్యాదుతో శ్రీచరణ్‌పై మసూరీ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. రాధా గాయత్రి మృతిపై మసూరీ పోలీసులకు ఆమె తండ్రి సుధాకర్ శనివారం చేసిన ఫిర్యాదులో అల్లుడు శ్రీచరణ్‌పై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి కొన్ని ఆధారాలు పోలీసులకు సమర్పించారు. 'రుషికేశ్, హరిద్వార్ యాత్ర గురించే మాకు చెప్పారు. టూర్ ప్లాన్‌లో మసూరీ గురించి గానీ, అక్కడ బస చేస్తున్న విషయంగానీ చెప్పలేదు. 14వ తేదీ రాత్రి భార్యాభర్తలు సన్నిహితంగా దిగిన సెల్ఫీ ఫొటో ఒకటి అల్లుడు శ్రీచరణ్ ఫోన్ నుంచి వచ్చింది. ఎప్పుడూలేని విధంగా రాత్రి 1.38 గంటలకు సెల్ఫీ ఫొటో పంపడం మరింత అనుమానాలకు తావిస్తోంది. బంగీజంప్‌కు వెళ్లామని చెబుతున్నాడు గానీ ఒక్క ఫొటో కూడా వారిద్దరి ఫోన్‌లలో లేదు. పూర్తిస్థాయి విచారణ చేసి మాకు న్యాయం చేయండి' అంటూ మృతురాలు రాధా గాయత్రి తండ్రి సుధాకర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. గాయత్రి, శ్రీచరణ్‌లకు గతేడాది నవంబరులో వివాహం జరిగింది.

## నరసాపురంలో మహిళ దారుణహత్య

**నరసాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో దారుణం చోటుచేసుకుంది. మహిళను ఓ వ్యక్తి కత్తితో నరికి చంపాడు. పోలీసులు తెలిపిన ప్రాథమిక వివరాల ప్రకారం.. టీనా రోజా స్వస్థలం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి. సూళ్లూరుపేటలో ఆమె ఏఎన్ఎం శిక్షణకు వెళ్లి తిరిగి వచ్చింది. నరసాపురం రైల్వేస్టేషన్‌లో దిగి కారులో ఇంటికి వెళ్తున్న సమయంలో మార్గాని రమేశ్ అనే వ్యక్తి దాడి చేశాడు. వాటర్ బాటిల్ కోసం ఓ షాపు దగ్గర యువతి కారు ఆపగా.. రమేశ్ విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. అడ్డుకునేందుకు యత్నించిన కారు డ్రైవర్ సురేశ్‌పైనా రమేశ్ కత్తితో దాడికి పాల్పడ్డాడు. అతడికి గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మీ ఊర్లో వానలు పడుతున్నాయా? ఈ పండ్లు తినండి.. అనారోగ్యాలు రావండి

వర్షాకాలంలో జలుబు, దగ్గు, జ్వరం వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. ఈ సమయంలో రోగనిరోధక శక్తిని పెంచే బొప్పాయి, దానిమ్మ, జామూన్, ఆపిల్, అరటిపండు వంటి పండ్లను ఆహారంలో చేర్చుకోవడం ద్వారా సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందడంతో పాటు శరీర ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు.. వర్షాకాలం ప్రారంభమైతే చల్లని వాతావరణం, వర్షాలు మనసుకు ఆహ్లాదాన్ని కలిగించినా, ఆరోగ్య పరంగా కొన్ని సవాళ్లను కూడా తీసుకొస్తుంది. ఈ కాలంలో జలుబు, దగ్గు, జ్వరం, అలర్జీలు, వైరల్ ఇన్ఫెక్షన్లు వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. అందుకే రోగనిరోధక శక్తిని బలోపేతం చేసే ఆహారాలను తీసుకోవడం చాలా ముఖ్యం. ముఖ్యంగా సీజనల్ పండ్లు శరీరానికి అవసరమైన పోషకాలను అందించి వ్యాధుల బారిన పడకుండా కాపాడతాయి.

**బొప్పాయి.. జీర్ణక్రియకు మేలు**

విటమిన్ సి, విటమిన్ ఎ, ఫైబర్ పుష్కలంగా ఉండే బొప్పాయి రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో ఉండే పాపైన్ అనే ఎంజైమ్ జీర్ణక్రియను మెరుగుపరచి మలబద్ధకం సమస్యను తగ్గిస్తుంది. వర్షాకాలంలో బొప్పాయి తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.

**పియర్ పండ్లు.. హైడ్రేషన్‌కు ఉత్తమం**

పియర్ పండ్లలో ఫైబర్, విటమిన్ కె అధికంగా ఉంటాయి. ఇవి జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరచి గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తాయి. నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడంలో కూడా సహాయపడతాయి.

**దానిమ్మ.. రక్తప్రసరణకు బలం**

పాలీఫెనాల్స్, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండే దానిమ్మ




రక్తప్రసరణను మెరుగుపరుస్తుంది. శరీరంలో వాపును తగ్గించి, వైరల్ ఇన్ఫెక్షన్ల నుంచి కోలుకునే శక్తిని పెంచుతుంది. రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడంలో కూడా దానిమ్మ కీలక పాత్ర పోషిస్తుంది.

**జామూన్.. ఇన్ఫెక్షన్లకు చెక్**

ఊదా రంగులో ఉండే జామూన్ పండులో విటమిన్ సి, ఐరన్, పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీర రక్షణ వ్యవస్థను బలపరచి సీజనల్ ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తాయి.

**రాంబుటాన్.. శరీరానికి తేమ, రోగనిరోధక శక్తి**

విటమిన్ సి, నీటి శాతం అధికంగా ఉండే రాంబుటాన్ పండు వర్షాకాలంలో శరీరానికి అవసరమైన తేమను అందిస్తుంది. అలాగే రోగనిరోధక శక్తిని పెంచి శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.

**అరటిపండ్లు.. పేగు ఆరోగ్యానికి మేలు**

అరటిపండ్లలో ఉండే పొటాషియం, ఫైబర్, ప్రీబయోటిక్ గుణాలు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. పేగు ఆరోగ్యాన్ని కాపాడి శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి.

**ప్లమ్స్.. మలబద్ధకానికి సహజ పరిష్కారం**

యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్‌తో నిండిన ప్లమ్స్ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. మలబద్ధకాన్ని నివారించి, పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. అలాగే రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా సహాయపడతాయి.

**ఆపిల్స్.. ప్రతిరోజూ ఒకటి ఆరోగ్యానికి మేలు**

ఫైబర్, విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆపిల్ గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. జీర్ణక్రియను ప్రోత్సహించి రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. రోజూ ఒక ఆపిల్ తీసుకోవడం ద్వారా శరీరానికి కావాల్సిన శక్తిని పొందవచ్చు. వర్షాకాలంలో ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారంతో పాటు సీజనల్ పండ్లను ఆహారంలో తప్పనిసరిగా చేర్చుకోవాలి. బొప్పాయి, పియర్, దానిమ్మ, జామూన్, రాంబుటాన్, అరటిపండు, ప్లమ్స్, ఆపిల్ వంటి పండ్లు శరీర రోగనిరోధక శక్తిని పెంచి సీజనల్ వ్యాధుల నుంచి రక్షించడంలో సహాయపడతాయి.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

సోమవారం, 22 జూన్, 2026




www.viswamvoice.com

# సొంత స్థలాలపై హక్కులు కల్పించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యకు శాశ్వత పరిష్కారం - ఎమ్మెల్యే వాసుకు సదరు కుటుంబాల కృతజ్ఞతలు**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దశాబ్దాలుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న సుమారు 100 కుటుంబాల కలను రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) సాకారం చేశారు. ఆర్ అండ్ బీ వాంబే గృహాల సమీపంలో, డంపింగ్ యార్డు ఎదురుగా ఉన్న స్థలాలకు సంబంధించి ఏర్పడిన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి శాశ్వత పరిష్కారం చూపించారు. ఈ సందర్భంగా సదరు కుటుంబాలతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఈ రోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఈ కుటుంబాలు తీవ్ర అనిశ్చితి, ఆందోళనకు గురయ్యాయని, తమ కష్టార్జిత ఆస్తులపై హక్కులు కోల్పోతామేమోననే భయంతో జీవించాల్సి వచ్చిందని ఎమ్మెల్యే వాసు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యమని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలనే సంకల్పంతో టౌన్ ప్లానింగ్ అధికారులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి నిరంతరం కృషి చేసినట్లు తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి సంబంధించి విడుదలైన అధికారిక గెజిట్ నోటిఫికేషన్, మ్యాప్‌లను బాధిత కుటుంబాలకు చూపిస్తూ ఎమ్మెల్యే వాసు వారికి పూర్తి భరోసా



కల్పించారు. "ఈ స్థలాలు మీవే... మీ హక్కులు సురక్షితం... ఇక మీరు నిశ్చింతగా ఇళ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవచ్చు" అని స్పష్టం చేశారు. ప్రజల సహకారం, అధికారుల సమిష్టి కృషి వల్లే ఈ విజయం సాధ్యమైందన్నారు. సమస్య పరిష్కారంలో భాగంగా అవసరమైన అన్ని స్థాయిల్లో చర్చలు జరిపి, ప్రభుత్వ అనుమతులు పొందేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ ప్రాంతాన్ని ఆదర్శవంతమైన కాలనీగా అభివృద్ధి చేసేందుకు రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, విద్యుత్ సదుపాయాలు తదితర మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలనీ లేఅవుట్‌ను శాస్త్రీయంగా రూపొందించి, ప్రజలకు అన్ని సౌకర్యాలు అందేలా ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం... ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం" అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. 45వ డివిజన్ ఇన్‌చార్జ్, టీడీపీ జిల్లా కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి కొయ్యల రమణ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రజా సమస్యల పరిష్కారంలో చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. మాజీ కార్పొరేటర్ మొకమాటి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నేళ్లుగా పరిష్కారం కాని సమస్యకు ఎమ్మెల్యే శాశ్వత పరిష్కారం చూపడం ప్రజల అదృష్టమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు, ఈ సమస్య పరిష్కారం సాధారణ ప్రక్రియ కాదని, అనేక స్థాయిల్లో పరిశీలన అనంతరం మాత్రమే సాధ్యమైందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ నిరంతర అనుసరణ, ప్రత్యేక చొరవ వల్లే ఈ ఫైల్ ముందుకు కదిలి పరిష్కారం దిశగా వెళ్లిందని వెల్లడించారు. ప్రమీల రాణి మాట్లాడుతూ తాము గత ఆరు సంవత్సరాలుగా ఈ స్థలం కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డాం... మా సర్వస్వం పెట్టి నిర్మించిన షెడ్‌ను అధికారులు కూల్చివేయడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం కోసం మున్సిపల్ కార్యాలయం నుంచి అమరావతి వరకు తిరిగాం, కానీ పరిష్కారం లభించలేదన్నారు. ఎన్నికలకు ముందు ఆదిరెడ్డి శ్రీనివాస్ ను కలిసి సమస్య చెప్పగా, "మీకు న్యాయం చేసే బాధ్యత నాది" అని మాట ఇచ్చారని గుర్తు చేశారు. ఈరోజు ఆ మాటను నిలబెట్టుకుని సమస్యను పరిష్కరించారని వివరించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాల సభ్యులు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలిపారు. తమకు సొంత స్థలాలపై హక్కులు కల్పించి, ఇళ్ల నిర్మాణానికి మార్గం సుగమం చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా ప్రారంభమైన

## ఎ.ఆర్.కె మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

**అత్యాధునిక పరికరాలతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు**
**రోగులకు మరింత మెరుగైన సేవలు అందించాలి**
**ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కుడిపూడి సత్తిబాబు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని స్థానిక భాస్కర్ నగర్, గాంధీపురం-4 ప్రాంతంలో ఆర్ఎంసీ గ్లో గార్డెన్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎఆర్‌కె మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కుడుపూడి సత్తిబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక వైద్య సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు, అత్యాధునిక పరికరాలతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నగర ప్రజలకు ఒకే చోట వివిధ ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమని పేర్కొన్నారు. వైద్య రంగంలో సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ రోగులకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆసుపత్రి యాజమాన్యానికి సూచించారు. అనంతరం ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి, అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, అత్యవసర సేవలు మరియు ఆధునిక చికిత్సా విధానాల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు మరియు స్థానికులు పాల్గొని నూతన ఆసుపత్రి ప్రారంభోత్సవాన్ని అభినందించారు.

## రోడ్డుపై ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్

**ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం**




**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనాలను ఇష్టానుసారంగా రోడ్డుకు ఇరువైపులా నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. రద్దీ సమయాల్లో వాహనాలు ముందుకు కదలలేని పరిస్థితులు ఏర్పడి వాహనదారులు, పాదచారులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికుల కథనం ప్రకారం, కొంతమంది ద్విచక్ర వాహనదారులు నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసేందుకు వచ్చినప్పుడు సమీపంలో ఉన్న ఖాళీ ప్రదేశాలు లేదా పార్కింగ్ స్థలాలను ఉపయోగించకుండా రహదారిపైనే వాహనాలను నిలిపివేస్తున్నారు. దీంతో రహదారి వెడల్పు తగ్గి ఎదురెదురుగా వచ్చే వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా పాఠశాలలు, కార్యాలయాలు ప్రారంభమయ్యే ఉదయం వేళలు, సాయంత్రం సమయంలో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సేవలకు సంబంధించిన వాహనాలు కూడా ఈ ట్రాఫిక్‌లో చిక్కుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తూ రోడ్డుపైనే వాహనాలను పార్క్ చేస్తున్న వారిపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే ప్రధాన రహదారుల వద్ద "నో పార్కింగ్" బోర్డులు ఏర్పాటు చేసి, ప్రత్యేక పార్కింగ్ స్థలాలను గుర్తించాలని సూచిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ పార్కింగ్‌ను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# గోదావరి గట్టుపై యోగాసనాలతో ఆరోగ్య సందేశం : కుడుపూడి సత్తిబాబు

**ఆరోగ్యమే మహాభాగ్యం.. యోగమే ఉత్తమ సాధనం - రాజమహేంద్రవరంలో ఘనంగా అంతర్జాతీయ యోగ దినోత్సవం**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం గోదావరి నది తీరాన నిర్వహించిన యోగ కార్యక్రమంలో రాష్ట్ర రాజమండ్రి ఎంపీ పురంధేశ్వరి , రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ , తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ చేకూరి కీర్తి గారు, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా తో కలిసి రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వారసత్వమని అన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి యోగా ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృషితో యోగాకు ప్రపంచవ్యాప్తంగా విశేష గుర్తింపు లభించిందని, నేడు అనేక దేశాల్లో యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో





ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు వివిధ కార్యక్రమాలను చేపడుతోందని, యోగా వంటి భారతీయ సంప్రదాయాలను ప్రోత్సహించడం కూడా అందులో భాగమేనని అన్నారు.

జీజీహెచ్ అభివృద్ధిపై
వైద్య ఆరోగ్య శాఖ మంత్రితో

## ఎమ్మెల్యే ఆదిరెడ్డి చర్చ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒక ప్రైవేట్ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాజమహేంద్రవరానికి విచ్చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌ను ఆర్ అండ్ బి అతిథి గృహంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) అభివృద్ధి, ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవల అందుబాటు, వైద్యులు మరియు సిబ్బంది కొరత నివారణ, ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు, అత్యవసర సేవల విస్తరణ, రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన వంటి పలు అంశాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. రోజురోజుకు పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా ఆసుపత్రిలో అదనపు వైద్య సిబ్బంది నియామకం, ప్రత్యేక వైద్య విభాగాల బలోపేతం, ఆధునిక నిర్ధారణ పరికరాల అందుబాటు, ఆసుపత్రి భవనాల అభివృద్ధి, పరిశుభ్రత నిర్వహణతో పాటు రోగులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందించాలని ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాజమహేంద్రవరం మాత్రమే కాకుండా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు వైద్య సేవలు అందిస్తున్న జీజీహెచ్‌ను మరింత అభివృద్ధి చేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. దీనిపై స్పందించిన మంత్రి సత్య కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల నాణ్యత పెంపు, మౌలిక సదుపాయాల విస్తరణ, ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. జీజీహెచ్ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టి ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ సమావేశం రాజమహేంద్రవరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి దిశగా కీలక చర్చగా నిలిచింది.

ఆరోగ్యకరమైన జీవన విధానంలో

## యోగా పాత్ర ముఖ్యం

**ప్రపంచ యోగా దినోత్సవం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత ప్రభుత్వం యువజన వ్యవహారాల మరియు క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భరత్, ఈస్ట్ గోదావరి ఆధ్వర్యంలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఉదయం స్థానిక ఏకేసి రోటరీ హాల్ నందు యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా యొక్క ప్రాముఖ్యత, ఆరోగ్యకరమైన జీవన విధానంలో యోగా పాత్ర గురించి పాల్గొన్న వారికి అవగాహన కల్పించారు. అనంతరం సామూహిక యోగా ప్రదర్శన నిర్వహించి, యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూత్ వాలెంటర్ సత్య యోగ గురు త్రినాథ్, వాసు పాల్గొన్నారు.

## శారీరక మానసిక ఆరోగ్యానికి యోగ అవసరం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగ ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని శ్రీ గౌతమి జీవకారుణ్య సంఘం చైర్మన్ వర్రే శ్రీనివాసరావు అన్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకు దానవాయిపేట యోగ మిత్ర మండలి యోగ గురువు సూరపు రెడ్డి తాతారావు ఆధ్వర్యంలో ఉమా రామలింగేశ్వర కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గౌరవ ముఖ్య అతిథిగా వర్రే శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగ ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలిగిస్తుందని, యోగాను కుటుంబ సమేతంగా చేయాలని సూచించారు. బాబాజీ యోగా గురువు, మేడిశెట్టి తాతబ్బాయి, రెడ్డి రాజు, యోగ కార్యక్రమంలో గిసాల బాపూజీ, రొక్కం గోపి, కే రామానాయుడు, అముజు ఈశ్వరి, ఎం వెంకటలక్ష్మి, ఎన్ కళ్యాణి, వి. సురేఖ, సన్నికళ, వై దుర్గ, కే. హేమా, అనిశెట్టి పద్మ, సూర్య నమస్కారములు, యోగ, జాగింగ్, ఆసనాలు ప్రాణాయామ ధ్యానం చేయించారు. యోగ సాధకులు ఆదిరెడ్డి రామకృష్ణ, శీరా వెంకటేశ్వరరావు, వేలిశెట్టి రాము, శనపతి సత్తిబాబు, పామర్తి గోపాలరావు, గుబ్బల గంగాభవాని, బేరీ రత్నాంబ, బాలాజీ చౌదరి, వీరబాబు, మాసవరపు భాస్కరరావు,గౌరీశంకర్ వాకర్స్ మిత్రులు హాజరయ్యారు. సందర్భంగా ఎన్ సత్యనారాయణ రాగి జావ, మెడికల్ మూర్తి మొలకలు ప్యాకెట్స్, ఎం భాస్కరరావు బటర్ మిల్క్, గుబ్బల గంగాభవాని, బేరి రత్నాంబ కలసి కోడిగుడ్లు యోగ డే సందర్భంగా యోగ సాధన చేసిన వారికి పంపిణీ చేశారు.

నాన్న నా జీవితంలో గురువు..

# నాకు హీరో మీరే నాన్న

**మా నాన్నకు అమృత హృదయంతో నా మనోగాద అంఖితం..**
**- మేడా శ్రీనివాస్**



నాన్న నీకు బిడ్డ నైనందుకు నేను ఎంతో గానో అదృష్టవంతుడును. నీవు చూపిన ప్రేమ, పంచిన ఆప్యాయత నాకు మరుపు రానిది.

నాన్న నీ కష్టం, నీ శ్రమ, నీ భాద్యత, భయమెరుగని నీ ఆత్మ విశ్వాసం సామాజిక స్పృహ నా జీవితాన్ని ఎంత గానో ప్రభావితం చేస్తుంది. ఆ జన్మాతం మీ బిడ్డ నైనందుకు నిత్య ఆనందాన్ని పొందుతుంటాను..

నాన్న మానవత్వాన్ని చాటుకోవటంలోను, దైవత్వాన్ని పూజించటం లోను మీకు మీరే సాటి. రాక్షసత్వాన్ని ఎదురోడ్డి నిలవటంలో కూడా మీకు మీరే సాటిగా మీ వారసత్వ ఆనందోత్సవాన్ని పొందటంలో ఎంతగానో నాకు సంతృప్తి ఉంటుంది.

నాన్న బిడ్డలకు జన్మ నివ్వటం ఒక వరమైతే ఆ బిడ్డలను ప్రయోజకులును చేయటం. వారి భవిష్యత్ కు కోసం మీరు చూపే తపన నిత్యం మమ్ము వెంటాడుతూనే ఉంటుంది.

నాన్న నా జీవిత మార్గంలో మీకు మించిన గురువు, దైవం, నాకు హీరో మీరే నని చెప్పుకోవటంలో నాకు కలిగే నిత్య సంతోషం అమితమైన ఆనందంతో ఉంచుతుంది.

నాన్న నాకు మీరు దూరమైనా నిత్యం మీరు నన్ను వెంటుండి నడిపిస్తున్నట్టుగానే నాకు స్పర్శగా, నాకు శ్వాసగా ఉంటుంది. నాకు కలిగే సహజ వేదన, ఆనందం, కీర్తి మీ నుండి పొందుతున్నాననే తృప్తితో జీవిచటంలో కలిగే మానస వికాశం నాకు మాత్రమే తెలుసును.

నాన్న మనిషి ఎలా జీవించాలో, బిడ్డలను ఎలా నడిపించాలో, కుటుంబాన్ని ఎలా ప్రేమించాలో, సమాజాన్ని ఎలా గౌరవించలో మీ నుండి పొందిన జ్ఞానం, విజ్ఞానం నేడు నన్ను నడిపిస్తున్నాయి.

నాన్న మీరు మాకు విద్యా బుద్ధులనే కాకుండా మనిషి ఎలా ఉండాలో, ఎలా బ్రతకాలో బాల్యం నుండి ఉగ్గుపాలు వలే బోధించిన మీ ఎనలేని కర్తవ్యం నన్ను గొప్ప ఆదర్శ వంతుడిగాను, మానవతా వాదిగాను తీర్చి దిద్దాయి.


సమయాన్ని వృధా చేసుకోవటం, నిర్లక్ష్యంగా ఉండటం, పెద్దలకు, పసి పిల్లలకు, బాధితులకు అండగా నిలవకపోవటం, దేశ భక్తిని చాటుకోక పోవటం, పర్యావరణాన్ని కలుషితం చేయటం వంటివి బద్ధి వైఖల్యంతో సమానం అని మీరు బోధించినవి నన్ను నిత్యం గుర్తు చేస్తుంటాయి.

నాన్న ఎంత సంతృప్తిగా జీవిస్తున్నా ఎందుకో మీరు లేరు అనే బాధ విశ్రాంతి సమయం లో నన్ను వేదిస్తు వేటడుతూనే ఉంటుంది. మీరు నాకు నింపిన మానవత్వ బాధ్యతలు నన్ను ఆ వ్యధ నుండి విముక్తుడిని చేస్తుంటుంది.

ఏది ఏమైనప్పటికీ ముమ్ము నాన్న అని చెప్పుకోవటానికి నాకు ఎంతో ఆనందాన్ని, ఒక మంచి గర్వాన్ని ఇచ్చినందుకు మీ ఋణం తీర్చుకోలేనిది, వెల కట్టలేనిది నాన్న ..

పితృ దేవ దినోత్సవ శుభాకాంక్షలుతో మీ బిడ్డ మనసులో సంకల్పంతో నిండిన వాక్కు మీకే అంఖితం నాన్న.......

**మీ బిడ్డ**
**మేడా శ్రీనివాస్**



# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మానవ జీవితంలో యోగ సర్వరోగ నివారిణిగా పనిచేస్తుందని, వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగ సాధన చేస్తే సత్ఫలితాలు పొందవచ్చని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను జిల్లా స్థాయిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగ సాధన ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుందని అన్నారు. భారతీయ సంస్కృతి, విలువలే దేశాన్ని ప్రపంచానికి విశ్వగురువుగా నిలిపాయని పేర్కొన్నారు. ఈ విలువలను కాపాడుకుంటూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఆరోగ్యకరమైన జీవనానికి యోగాపై అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. యోగ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను అందిస్తుందని చెప్పారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరికీ యోగ ఉపయోగకరమని, వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగ సాధన



చేయవచ్చన్నారు. పిల్లలు, గర్భిణీలు, యువకులు, వృద్ధులు క్రమం తప్పకుండా యోగాభ్యాసం చేయడం వల్ల శరీరంలో చురుకుదనం పెరిగి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతుందని తెలిపారు. యోగ ద్వారా ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని పేర్కొన్నారు. ప్రతిరోజూ కొంత సమయం యోగకు కేటాయించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందవచ్చన్నారు. డయాబెటిస్, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులను నియంత్రించడంలో యోగ కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబాలు, సమాజం, జిల్లా మరింత అభివృద్ధి చెందుతాయని అన్నారు. జాయింట్ కలెక్టర్ నైదియా దేవి మాట్లాడుతూ ప్రజలు వ్యాధుల బారిన పడకముందే వారి ఆరోగ్యాన్ని పరిరక్షించడం, వ్యాధులను నివారించడం 'యోగాంధ్ర' కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. డీఆర్వో వి.సుబ్బారావు మాట్లాడుతూ రోజుకు కనీసం అరగంట సమయం యోగ కోసం కేటాయిస్తే శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఒత్తిడి, ఆందోళనలను అధిగమించవచ్చన్నారు. ముఖ్యంగా నేటి యువతలో పెరుగుతున్న ఒత్తిడిని ఎదుర్కోవడంలో యోగ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. యోగను ప్రతి కుటుంబంలో ఒక దినచర్యగా మార్చుకుని ఈ చారిత్రక వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకుడు చంద్రశేఖర్, బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు, ఆయుష్ వైద్యాధికారి శ్యాంసుందర్, జిల్లా పర్యాటక అధికారి అన్వర్ హుస్సేన్, జిల్లా పౌర సరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్, డీఎస్డీఓ రుద్ర, డీఆర్డీఏ పీడీ డి. రాంబాబు తదితర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న కుటుంబాలకు

# అండగా నిలిచిన మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న పలువురు నిరుపేద కుటుంబాలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తన మానవత్వాన్ని చాటుతూ మొత్తం రూ.45 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. రామచంద్రపురం నియోజకవర్గంలో కష్టాల్లో ఉన్న కుటుంబాల సమస్యలను స్వయంగా తెలుసుకుని ఆయన ఈ తక్షణ సహాయం అందజేశారు. పేదరికం వైద్యానికి, విద్యకు అడ్డంకి కాకూడదనే సదుద్దేశంతో ఆయన బాధితులకు అండగా నిలిచారు. వివరాల్లోకి వెళితే.. కాజులూరు మండలం మంజేరు గ్రామానికి చెందిన యాదగిరి చిరంజీవి భర్త ఇటీవల గుండెపోటుతో మృతిచెందడంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. ఈ విషయం తెలుసుకున్న మంత్రి సుభాష్ వెంటనే స్పందించి ఆ కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సహాయం అందించి మనోధైర్యాన్ని కల్పించారు. అలాగే రామచంద్రపురానికి చెందిన ఆటో డ్రైవర్ వంశీ తీవ్ర ఆర్థిక సమస్యల కారణంగా తన పిల్లల చదువులు కొనసాగించలేని పరిస్థితిలో ఉండగా వారి విద్యకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. మరోవైపు, కొత్తూరు టిడ్కో కాలనీకి చెందిన శివంగల కామాక్షి ఊపిరితిత్తులు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని తెలుసుకున్న మంత్రి తక్షణ సాయంగా ఆమెకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. అంతటితో ఆగకుండా, ఆమెకు మెరుగైన వైద్యం అందించేందుకు మంగళగిరికి తరలించే నిమిత్తం తన సొంత ఖర్చులతో అంబులెన్స్‌ను సైతం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా



మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ.. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు వారి వద్దకు వెళ్లి సహాయం చేయడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని స్పష్టం చేశారు. పేదరికం కారణంగా ఎవరూ వైద్యం చేయించుకోలేని పరిస్థితి రాకూడదని, నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి వైద్యం అందేలా ఇప్పటికే మూడు కంటైనర్ ఆసుపత్రులు, ఒక సంచార వైద్యశాలను ఏర్పాటు చేశామని, ప్రజలు ఈ వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. తాను ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నిరంతరం ఆర్థిక సహాయాలు, వైద్య సహకారం, విద్యా ప్రోత్సాహక కార్యక్రమాలు చేపడుతూ అభాగ్యులకు భరోసాగా నిలుస్తున్న మంత్రి సుభాష్ మానవతా దృక్పథం పట్ల రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రియదర్శిని బాలవిహార్లో ఘనంగా యోగా వేడుకలు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రియదర్శిని బాలవిహార్లో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని వేడుకలను నిర్వహించారు. కలకత్తాలోని రెడ్ రోడ్డు ప్రాంతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో జరిగిన 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని డిజి క్లాస్ లో లైవ్ లో అక్కడమిక్ డైరెక్టర్ అద్దంకి సాహిత్య నేతృత్వంలో వీక్షిస్తూ యోగాసనాల అభ్యసన, శిక్షణ,ప్రదర్శన కార్యక్రమాన్ని అత్యంత ఆనందోత్సాహాలతో నిర్వహించారు.తదుపరి చిన్నారులు అనేక ఆసనాలను విభిన్న రీతులలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రియదర్శిని చిన్నారులు, ఉపాధ్యాయులు అత్యంత శ్రద్ధాసక్తులతో పాల్గొన్నారు. కరస్పాండెంట్ అద్దంకి బుద్ధ చంద్ర దేవ్ యోగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.



రాజోలు మత్స్య శాఖ ఏడి రమణారావుని సన్మానించిన

# రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజోలు మత్స్య శాఖ ఏ డి గా ఇటీవలే మచిలీపట్నం నుండి డిప్యూటీషన్ మీద బాధ్యతలు స్వీకరించిన విళ్ల రమణారావును సత్యానందం ఆదివారం కొత్తపేటలో వారి నివాసంలో సన్మానించారు మత్స్య శాఖ అభివృద్ధి కి మరింత కృషి చేయాలి కోరారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర యువ మోర్చా నాయకులు పాలూరి జయ ప్రకాష్ నారాయణ పాల్గొన్నారు.

# మానసిక, శారీరక ప్రశాంతతకు యోగా, ధ్యానం తప్పనిసరి : ఆర్డిఓ డీఎస్పీ



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్పవరం యోగా వశిష్ట పిరమిడ్ కేంద్రం వద్ద జరిగిన యోగా దినోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప వరం యోగా అని, ప్రపంచ దేశాల ప్రజలందరూ యోగాను ఆచరిస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు.వశిష్ట గౌతమి పిరమిడ్ కేంద్రంలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ఆయన ఆర్డీఓ జి వి వి సత్యానారాయణ, డి.ఎస్.పి సుంకర మురళి కృష్ణ, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆకుల రామకృష్ణ, ముళ్ళపూడి భాస్కరరావు, కుసంపూడి రామకృష్ణరాజు కలిసి పాల్గొన్నారు. యోగాసనాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుభాష్ పత్రీజీ ఆశీస్సులతో వారి శిష్య బృందం మన ప్రాంతంలో ఇంత గొప్ప పిరమిడ్ కేంద్రాన్ని నిర్మించి మనకు అందించడం గర్వకారణమన్నారు. యోగాడే ఇక్కడ నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. యోగ, ధ్యానం అభ్యసించడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయన్నారు. చక్కటి ఆరోగ్యకరమైన సమాజం సాధించడానికి యోగా ఉపయోగపడుతుందని, మానసిక ప్రశాంతత, శారీరక ఆరోగ్యం లభిస్తాయన్నారు. ప్రస్తుత కాలంలో ఉన్న మానసిక ఒత్తిడిలను జయించాలంటే మనసును నియంత్రించాలన్నా యోగా తప్పనిసరని పేర్కొన్నారు. యోగాను ఈరోజు మాత్రమే చేసే ఒక వ్యాయామంగా కాకుండా నిత్య కార్యక్రమంగా అందరూ తమ జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ యోగాను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లారన్నారు. మరి ముఖ్యంగా ప్రధాని మోదీ యోగాపై ప్రపంచవ్యాప్తంగా అందరికీ అవగాహన కలిగేలా చేశారన్నారు. విశ్వంలో ఉన్న సహజశక్తిని పిరమిడ్ ద్వారా మనం పొందగలుగుతామన్నారు. పిరమిడ్ లో ధ్యానం వల్ల మరింత శక్తిని శరీరం, మనసు పొందగలుగుతాయన్నారు. రాబోయే పుష్కరాలను పురస్కరించుకుని వచ్చే సంవత్సరం జిల్లా కలెక్టర్, అధికారులతో మాట్లాడి జిల్లాస్థాయిలో యోగా కార్యక్రమాన్ని వశిష్ట పిరమిడ్ కేంద్రం వద్ద నిర్వహించుకుందామన్నారు. పిరమిడ్ కేంద్రం అభివృద్ధి కోసం, ఈ ప్రాంత అభివృద్ధి కోసం సహాయ సహకారాలు అందిస్తానన్నారు.

ప్రపంచం వ్యాప్తంగా యోగ పట్ల

# ప్రేరణ పెరగడానికి కారణం నరేంద్ర మోడీ : పాలూరి

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగ కొత్తపేటలో ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం పాల్గొనడం జరిగింది. ఆర్ ఎస్ ఎస్ కోనసీమ బౌద్ధ ప్రముఖ్ తోగరు ఆంజనేయులు, బసవ రాజు ఆధ్వర్యంలో యోగసనాలు వేయించారు. అనంతరం యోగ విశిష్టతను వివరించారు. అనంతరం ముఖ్య



అతిథి రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా యోగ పట్ల ప్రేరణ కల్పించి న గొప్ప వ్యక్తి భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అని,యోగ అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదు, మనస్సు, శరీరం మరియు ఆత్మ మధ్య సమతుల్యతను పెంపొందించే జీవన విధానం. ఈ కార్యక్రమం లో రాష్ట్ర యువ మోర్చా నాయకులు పాలూరి జయ ప్రకాష్ నారాయణ, జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షులు కోటిపల్లి దామోదర్, కిసాన్ మోర్చా నాయకులు ఉద్ద రాజు ప్రసాద్ రాజు, అంజిబాబు,అరిగేల రమేష్,అన్యం సత్యనారాయణ, శ్రీఘకోలపు భీమేశ్వరరావు, సాయి బలరాం,బొరుసు లక్ష్మణరావు, బొరుసు భద్రం తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం పలివెలలో

# అంతర్జాతీయ యోగా దినోత్సవం

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా అంబేద్కర్ కోనసీమ జిల్లా సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం పలివెల నందు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు రెవరెండ్ సిస్టర్ సునీత మరియు సిస్టర్ మేరీ కురిసేరి సిస్టర్ రెజీనా సిస్టర్ అబిత పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థులంతా కలిసి ఈ




యోగా కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా జరిపించడం జరిగింది ఇందులో భాగంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు సిస్టర్ సునీత యోగ విశిష్టత విద్యార్థులు పాటించవలసిన నియమాలు ప్రత్యేకంగా శ్రద్ధ ఏకాగ్రత ఆహారపు అలవాట్లు మానసిక దృఢత్వం పెంపొందించుకునే విధంగా విద్యార్థులకు సూచనలు చేయడం జరిగింది ప్రతి ఒక్కరికి అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ కార్యక్రమాన్ని ముగించారు.

రాజోలు, అమలాపురం పరిసర ప్రాంతాల్లో

# 23, 24 తేదీల్లో విద్యుత్ కోతలు

**కొత్తపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కొత్తపల్లి రాంబాబు**

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** నర్సాపురం వద్ద 132కె వి విద్యుత్ నెట్‌వర్క్ బలోపేతం చేసే పనుల నిమిత్తం,రాజోలు మరియు అమలాపురం పరిసర ప్రాంతాల్లో ఈ నెల 23 (మంగళవారం), 24 (బుధవారం) తేదీల్లో విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం కలగనున్నట్లు కొత్తపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కొత్తపల్లి రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అభివృద్ధి పనులలో భాగంగా, 132కె వి రాజోలుకు సరఫరా అయ్యే విద్యుత్‌ను తాత్కాలికంగా అమలాపురం సబ్‌స్టేషన్ ద్వారా మళ్లించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కారణంగా దిగువ పేర్కొన్న సమయాల్లో కరెంటు కోతలు అమలులో ఉంటాయని వివరించారు విద్యుత్ కోతల సమయాలు 23.06.2026 (మంగళవారం) ఉదయం 08:00 గంటల నుండి ఉదయం 11:00 గంటల వరకు (3 గంటల పాటు) 24.06.2026 (బుధవారం) ఉదయం 08:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు (5 గంటల పాటు) ఈ పనుల సమయంలో అనుకోని విధంగా ఏవైనా అత్యవసర విద్యుత్ కోతలు విధించవలసి వస్తే వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ కోరుతోంది. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, విద్యుత్ అంతరాయం వల్ల ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఈఈ విజ్ఞప్తి చేశారు.

రెవెన్యూ దినోత్సవ వేడుకల్లో

# ఉత్తమ విఆర్ఓగా పైడిమల్ల సత్తిబాబు

**జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందజేత**




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం నరసరావుపేట మరియు చోడవరం గ్రామాల్లో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న పైడిమల్ల సత్తిబాబు ఉత్తమ విఆర్ఓగా ఎంపికయ్యారు. జూన్ 20, 2026 శనివారం నాడు జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించిన రెవెన్యూ డే (రెవెన్యూ దినోత్సవం) వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు జాయింట్ కలెక్టర్ల చేతుల మీదుగా ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అత్యంత వైభవంగా అందుకున్నారు. రామచంద్రపురం మండల పరిధిలోని ఉత్తమ గ్రామాల్లో భాగంగా నరసరావుపేట మరియు చోడవరం గ్రామాలు అగ్రస్థానంలో నిలవడంలో విఆర్ఓగా పైడిమల్ల సత్తిబాబు అందించిన నిరంతర సేవలు, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో చూపిన చొరవ ఎంతో దోహదపడ్డాయి. గ్రామాల్లో రెవెన్యూ సేవల నిర్వహణను సులభతరం చేస్తూ భూ సమస్యల పరిష్కారంలో మరియు ప్రజలకు అందుబాటులో ఉంటూ కనబరిచిన విధి నిర్వహణ, నిబద్ధతను గుర్తించి ఉన్నతాధికారులు ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకమైన సేవలతో మండలంలోనే నరసరావుపేట, చోడవరం గ్రామాలను ఆదర్శంగా నిలిపినందుకు గాను ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా సత్తిబాబుకు స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది, మండల అధికారులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హృదయపూర్వక శుభాకాంక్షలు మరియు అభినందనలు తెలియజేస్తున్నారు.

రామచంద్రపురం ఆర్టీసీ డిపోలో

# విజయవంతంగా 'యోగాంధ్రా' కార్యక్రమం

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రామచంద్రపురం



ఆర్టీసీ డిపోలో ఆదివారం 'యోగాంధ్రా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. డిపో గ్యారేజ్ ఆవరణలో ఉదయం 8 గంటల నుండి 9 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి యోగా శిక్షకులుగా సత్తినేటి వెంకటరమణ, ఈశ్వర్ సందీప్ వ్యవహరించారు. వీరు ఆర్టీసీ సిబ్బందికి యోగా ప్రాముఖ్యతను వివరిస్తూ, వారితో వివిధ రకాల ఆసనాలు, సూర్య నమస్కారాలు చేయించారు. డిపో మేనేజర్ పేపకాయల భాస్కర్ రావు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, యోగాంధ్రాలో ఉత్సాహంగా పాల్గొన్న ఉద్యోగులందరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. శారీరక, మానసిక ఆరోగ్యాల కోసం ప్రతి ఒక్కరూ నిత్యం కనీసం 10 నుండి 15 నిమిషాల పాటు తమ ఇళ్ల వద్దనే యోగా సాధన చేయాలని ఆయన ఈ సందర్భంగా అందరికీ సూచించారు.

# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

**కోటి రూపాయలతో పార్క్ అభివృద్ధి, యోగా హాల్ ఏర్పాటు : మంత్రి వాసంశెట్టి సుభాష్**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణం చింతపల్లి సూరన్న నగర్‌లోని ఇందిరాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆర్డీవో సరళావతి, మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్. రాజు తదితరులు పాల్గొన్నారు. వీరంతా విద్యార్థులు, అధికారులతో కలిసి యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యానికి మార్గదర్శకమని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చొరవతో ఐక్యరాజ్యసమితి జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించడం గర్వకారణం అన్నారు. రామచంద్రపురంలో కోటి రూపాయల వ్యయంతో శివాలయం పార్కును అభివృద్ధి చేస్తున్నామని, అందులో యోగా, మెడిటేషన్ హాల్, మహిళల కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఒత్తిడులు, అనారోగ్య సమస్యలు పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని, తద్వారా ఆరోగ్య భారతాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. ఆర్డీవో సరళావతి, మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.రాజు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవనానికి యోగా పునాది అని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే యోగా అలవాటు చేసుకోవడం ద్వారా ఏకాగ్రత, క్రమశిక్షణ పెరుగుతాయన్నారు. యోగా మన సంస్కృతిలో భాగమైన గొప్ప సంపద అని, దానిని ప్రతి కుటుంబం ఆచరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా సాధన చేశారు.

# శరీరం, మనసు, ఆత్మల కలయికే యోగా : లయన్ జి.వి రావు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి. రావు ఆధ్వర్యంలో ఆదివారం మోడరన్ అమ్మ హాస్టల్ విద్యార్థులకు యోగాపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జి.వి. రావు విద్యార్థులకు వివిధ యోగాసనాలను సరళంగా నేర్పించారు. ఈ సందర్భంగా జి.వి. రావు మాట్లాడుతూ.. యోగా ప్రక్రియ భారతదేశం ప్రపంచానికి అందజేసిన గొప్ప వరమని అభివర్ణించారు. యోగా అంటే కేవలం వ్యాయామం కాదని, 'యూజ్' అనే సంస్కృత పదం నుండి ఈ పదం ఆవిర్భవించిందని, ఇది శరీరం, మనసు, ఆత్మల కలయిక అని పేర్కొన్నారు. యోగా సాధన ద్వారా శరీరానికి ఫ్లెక్సిబిలిటీ ఏర్పడి వెన్నెముక బలపడుతుందని, రోగ నిరోధక శక్తి పెరిగి దీర్ఘకాలిక వ్యాధుల ప్రభావం తగ్గుతుందని తెలిపారు. అంతేకాకుండా ఒత్తిడి తగ్గి, ఏకాగ్రత పెరుగుతుందని భావోద్వేగాలను పూర్తిగా అదుపులో ఉంచుకోవచ్చని వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ కృషితో 2014 డిసెంబర్ 11న ఐక్యరాజ్యసమితి జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించిన విషయాన్ని జి.వి. రావు గుర్తుచేశారు. నేడు 210కి పైగా దేశాల్లో యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారని ఇది ప్రపంచంలోనే అతిపెద్ద కమ్యూనిటీ సెలబ్రేషన్‌గా మారిందని తెలిపారు. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవన పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ యోగాను తప్పనిసరిగా తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇదే రోజున అంతర్జాతీయ ఫాదర్స్ డే (పితృ దినోత్సవం) కూడా జరుపుకోవడం ఆనందంగా ఉందని జి.వి. రావు పేర్కొన్నారు. పిల్లలకు గొప్ప భవిష్యత్తు అందజేయడంలో తండ్రికి ప్రత్యేక పాత్ర ఉందని కొనియాడారు. తండ్రిని 'త్యాగజీవి'గా అభివర్ణించిన ఆయన ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులు చేసే త్యాగాలను జీవితాంతం గుర్తుంచుకుని వారిని ఎల్లప్పుడూ గౌరవించాలని హితవు పలికారు.

విద్యార్థుల ప్రతిభకు వేదికగా

# సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సమ్మర్ క్యాంప్




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణ టౌన్ హాల్‌లో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 45 రోజులపాటు నిర్వహించిన సమ్మర్ క్యాంప్ విజయవంతంగా ముగిసింది. డాన్స్, కరాటే, కిక్ బాక్సింగ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, చెస్, ఏఐ టెక్నాలజీ తదితర అంశాల్లో మొత్తం 242 మంది విద్యార్థులు ఈ క్యాంపులో శిక్షణ పొందారు. ఇందుకు సంబంధించి స్థానిక మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియంలో సమ్మర్ క్యాంప్ సక్సెస్ మీట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆర్డీవో సరళావతి, మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్. రాజు, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారికి సరైన దిశానిర్దేశం చేయడంలో ఈ సమ్మర్ క్యాంప్ ఆదర్శప్రాయంగా నిలిచిందని కొనియాడారు. ఈ వేదిక ద్వారా పిల్లలు, యువత తమ ప్రతిభను ప్రదర్శించుకునే అవకాశం కల్పిస్తామన్నారు. ఆర్డీవో సరళావతి మాట్లాడుతూ, వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా ప్రయోజనకరమైన శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ సెలవుల్లో విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు బానిసలు కాకుండా వారిలో క్రమశిక్షణ, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ క్యాంపును నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం అతిథులు శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థులు తాము క్యాంపులో నేర్చుకున్న డాన్స్, కరాటే, కిక్ బాక్సింగ్ తదితర కళలను వేదికపై ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు. ఇదే వేదికపై, కిక్ బాక్సింగ్‌లో అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి రామచంద్రపురానికి గుర్తింపు తీసుకువచ్చిన ఆల్‌రౌండర్ కారుమూరి నిహారికను మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విశ్వంవాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
కాకినాడ
జిల్లా ఎడిషన్
సోమవారం, 22 జూన్ 2026
www.viswamvoice.com



# జనంలో పుట్టిన పార్టీ జనసేన.. జైల్లో పుట్టిన పార్టీ వైసీపీ

## కాకినాడ రూరల్ ఎమ్మెల్యే వైసిపి కాపు నేతలపై ఫైర్



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్** : కాకినాడ రూరల్ తిమ్మాపురం గ్రామం ప్రజ్ఞ ఫంక్షన్ హాల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయినందున కనివిని ఎరగని రీతిలో పలు సంక్షేమ కార్యక్రమాలు పలు అభివృద్ధి పనులు ఈ రెండు సంవత్సరాల్లో పూర్తయినందున కాకినాడ రూరల్ అధికారుల సమక్షంలో కూటమి సభ్యులు, కూటమి నాయకులు ఆధ్వర్యంలో రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్యఅతిథిగా విజయోత్సవ సభను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సభలో గవర్నమెంట్ విద్యార్థుల సక్సెస్సు , రైతులు, వికలాంగులు, మృత్యుకారులు, అంగన్వాడీలు, పలు సమస్యలపై అభివృద్ధి చెందిన ప్రాంతాల వాసులు ఈ కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వమని కితాబిచ్చారు. తధానంతరం ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ ఈ రూరల్ నియోజకవర్గం లో నా వెన్నంటు ఉండి నడిచిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు చేయడం కోసం అహర్నిశలు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సభ ముగిసిన వెంటనే ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ ప్రెస్ మీట్ లో వైసిపి ప్రభుత్వం చేయలేని పనిని రెండు సంవత్సరాల్లో చేసి చూపించమని ధీమా వ్యక్తం చేశారు. ఇంకా రెండు మూడు పథకాలను త్వరలో కూడా పూర్తి చేస్తామని తెలిపారు. వైసిపి కాపు నాయకులను ఉద్దేశించి తీవ్ర విమర్శలు చేశారు. పవన్ కళ్యాణ్ కి కులం అనేది అంటకట్టవద్దని, ఆయనను అన్ని కులాలు నమ్మి ఓటు వేశారని హెచ్చరించారు. ప్రతి కులంలో జనసేన పార్టీ ఉందని, మా పార్టీకి అన్ని కులాలు సమానమేనని, మీ పార్టీ జైల్లో పుట్టిందని మా పార్టీ జనంలో నుంచి పుట్టిందని ఆనందం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ ఎక్కడి నుంచి పోటీ చేస్తే మీకెందుకు అని, దమ్ముంటే మీ అధినేత జగన్మోహన్ రెడ్డి కాకినాడ రూరల్ లో పోటీ చేయాలని సవాల్ విసిరారు. మీ పార్టీ దళిత సోదరులను చంపే పార్టీ అని, మీ వైసీపీ పార్టీలో ఉన్న నాయకులందరూ నేరస్తులని తీవ్ర విమర్శలు చేశారు. అభివృద్ధి పనులకు ఆటంకాలు ఎవరైనా కలిపిస్తే సహించేది లేదని, రాజకీయాలలో పాత పరిచయాలు ఉండడం వలన ఇప్పటివరకు మౌనంగా ఉన్నానని, ఇకనుండి మా అధినేత జోలికి గాని, మా నాయకులు జోలికి గాని వస్తే తోలు తీస్తానని వైసిపి కాపులు నాయకులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్** : నీట్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తున్న కాకినాడలో పలు పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ఆదివారం స్వయంగా సందర్శించి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, అత్యంత పారదర్శకంగా జరిగేలా పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును ఆయన నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేస్తూ, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, పరీక్షా నిబంధనలకు అనుగుణంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు కొనసాగించాలని ఆదేశించారు.అదేవిధంగా, పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పరీక్షా నిర్వహణకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. కాకినాడ అడిషనల్ ఎస్పి (ఏ ఆర్)ఎస్ శ్రీనివాసరావు, కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ పాటిల్ దేవరాజ్ మనీష్ పలువురు సీఐలు, ఎస్సైలు, సిబ్బంది నీట్ ఎగ్జామినేషన్ విధుల్లో పాల్గొన్నారు.

# మహిళా యోగ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పంతం



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్** : మహిళలందరూ ఆరోగ్యంగా ఉండాలని ఉద్దేశంతో కాకినాడ రూరల్ మండలం వాక లపూడి గ్రామంలో 45 లక్షల రూపాయలతో యూనివర్సల్ బయో ఫ్యూల్స్ సిఎస్ఆర్ నిధులతో ఎనిమిది నెలల కాలంలోనే మహిళలకు ఉపయోగపడే విధంగా యోగా సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని అలాగే వలస పాకల వాకలపూడి తదితర గ్రామాల నుంచి యోగా చేసుకునే మహిళలకు ఎంతోఉపయోగపడుతుందని యోగ సెంటర్లోఏర్పాటుచేసిన యూనివర్సల్ బయో ఫ్యూల్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు అని ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. గ్రామ కార్యదర్శి పి పి రంగారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పంతం నానాజీ విచ్చేసి రిబ్బన్ కట్ చేసి యోగ సెంటర్ ను ప్రారంభించడం జరిగింది. అనంతరం యూనివర్సల్ బయో ఫ్యూల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి సంజీల్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే పంతం నానాజీ పిలుపుమేరకు పంచాయతీ ఇచ్చిన రెండు వందల యాభై గజాల స్థలంలో 45 లక్షల ఓ యోగా సెంటర్ ను మహిళలకు ఉపయోగపడే విధంగా అన్ని హక్కులతో ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అలాగే పందూరు సిపిడబ్ల్యూఎస్ స్కీం 20 లక్షల రూపాయలతో ఫిల్టర్ బెడ్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అలాగే గ్రామంలో ఎన్నో కార్యక్రమాలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ప్రపంచ యోగ దినోత్సవం పురస్కరించుకుని ఈరోజు యోగ సెంటర్ ను మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం ఈరోజు ప్రారంభించడం ఆనందదాయమన్నారు. ప్రతి మహిళా ఆరోగ్యంగా ఉండాలంటే యోగా తప్పనిసరి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు శ్రీనివాస బాబా, చప్పిడి వెంకటేశ్వరరావు, రంబాల వెంకటేశ్వరరావు, నందిపాటి త్రిమూర్తులు,యూనివర్సల్ బయో ఫూల్స్ హెచ్ఆర్ మేనేజర్ సత్య గంగాధర్ రావు, ప్రొడక్షన్ మేనేజర్ గోవిందరాజులు, యోగా గురువు సత్యనారాయణ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పేపర్ మిల్లు కాలుష్యంపై మేడా శ్రీనివాస్ ఫిర్యాదు

## గోదావరి జలాల కాలుష్యంపై సమగ్ర విచారణకు డిమాండ్





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్** : గోదావరి జలాలు, వాయు కాలుష్యానికి కారణమవుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏపీ పేపర్ మిల్లు యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (ఆర్పీసీ) వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో పార్టీ నాయకులు రాజమహేంద్రవరం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్పీసీ సీనియర్ నాయకుడు పెండ్యాల కామరాజు మాట్లాడుతూ, రాజమహేంద్రవరం నగర పరిధిలోని సుమారు ఎనిమిది లక్షల మంది ప్రజల ఆరోగ్యాన్ని పేపర్ మిల్లు కాలుష్యం ప్రమాదంలోకి నెడుతోందని ఆరోపించారు. కాలుష్య నియంత్రణ మండలి, రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించకుండా మిల్లు యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గోదావరి జలాలు, వాయు కాలుష్యంపై సంబంధిత అధికారులను వివరణ కోరినప్పటికీ, మిల్లు అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తోందని అధికారులు తప్పుడు సమాచారం ఇచ్చారని ఆరోపించారు. అనంతరం జరిగిన శాస్త్రీయ పరీక్షల్లో గోదావరిలో ప్రమాదకర రసాయనాలు కలుస్తున్నట్లు తేలిందని పేర్కొన్నారు. పేపర్ మిల్లు విడుదల చేస్తున్న వ్యర్థాల కారణంగా ప్రజల్లో కంటి, చర్మ, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని, వ్యవసాయ భూములు, పంటలు, పశుసంపదపై కూడా తీవ్ర ప్రభావం పడుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. 2027 గోదావరి పుష్కరాల దృష్ట్యా భక్తుల మనోభావాలు, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఈ వ్యవహారంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో పాటు సంబంధిత మంత్రులు, అధికారులు ఇచ్చిన ప్రకటనలు మరియు సాక్ష్యాలను నమోదు చేసి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మిల్లు యాజమాన్యం, బాధ్యులైన అధికారులపై నీటి కాలుష్య నివారణ చట్టం-1974, పర్యావరణ పరిరక్షణ చట్టం-1986, వాయు కాలుష్య నియంత్రణ చట్టం-1981, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సంబంధిత సెక్షన్ల ప్రకారం క్రిమినల్, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. అనంతరం ఆర్పీసీ నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని "గోదావరి జలాలను రక్షించాలి", "ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలి", "పేపర్ మిల్లుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి", "పుష్కరాల నాటికి మిల్లును మూసివేయాలి" అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పెండ్యాల కామరాజు, డీవీ రమణమూర్తి, లంక దుర్గాప్రసాద్, దుద్దే సురేష్, గుడ్ల సాయి దుర్గాప్రసాద్, వర్ధనపు శరత్ కుమార్, మేడా చిన్నారి, కొల్లి సత్యనారాయణ, పాండ్రంకి ఈశ్వరరావు, యేడిద బాబులు, పసుపులేటి వీర్రాజు, మాసా లక్ష్మి, బోడపాటి సువర్ణ వేణు, పసుపులేటి సుశీల, పద్మనాభం ధనస్సు తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో మన ఆరోగ్యం మన చేతుల్లో..



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్** : అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర "ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు" రాష్ట్ర ప్రభుత్వం, రాజమండ్రి కోటిలింగాల రేవు వద్ద రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో "యోగాంధ్ర" కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరిగింది. ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో మనుషులు యాంత్రిక జీవితం గడుపుతున్నారని, ప్రస్తుతం ఎక్కువ శాతం ప్రజలు టెక్నాలజీ కి సంబంధించిన సెల్ ఫోన్లు, కంప్యూటర్లు వంటి పరికరాల మీద ఆధారపడి జీవించడం వలన స్వంతంగా ఆలోచించే శక్తి మరియు జ్ఞాపకశక్తినీ కోల్పోతున్నారని, రసాయనిక ఎరువులుతో పండించిన పంటల వలన ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని, వీటి నుండి మనం రక్షణ పొందాలంటే యోగ ఒకటే మార్గం అని, యోగాసనాల వలన శరీర అవయవాలు బాగుంటాయని, ధ్యానము వలన మనసు ప్రశాంతత, జ్ఞాపకశక్తి వంటివి పెరుగుతాయని "యోగా గురువు రాందేవ్ బాబా" వంటి వారు చెప్తున్నారు అని ఈ సందర్భంగా యోగా గురువు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి , జాయింట్ కలెక్టర్ మెగా స్వరూప్, కమిషనర్ రాహుల్ మీనా, ఎమ్మెల్సీ సోము వీర్రాజు,ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, కుమ్మర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ దాలిపర్తి వేమన, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దామని నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు యేసు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ సూర్యారావు, అనేకమంది మున్సిపల్ అధికారులు మరియు సిబ్బంది, విద్యార్థులు, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

### మండలంలో ఘనంగా అంతర్జాతీయ

# యోగా దినోత్సవ వేడుకలు

## విద్యార్థులు, అధ్యాపకుల ఆధ్వర్యంలో యోగాసనాల ప్రదర్శన





**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్** : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాయవరం మండలంలోని పలు విద్యాసంస్థల్లో యోగా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని యోగాసనాలు ప్రదర్శించారు.

**ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగా సందడి**

రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ప్రిన్సిపాల్ రామారావు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కళాశాల బోటని సబ్జెక్టు అధ్యాపకులు కుమార్ సారధ్యంలో విద్యార్థులు వివిధ రకాల యోగాసనాలు ప్రదర్శించారు. యోగా వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయని అధ్యాపకులు తెలిపారు. ప్రతిరోజూ యోగాను అలవాటుగా చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అద్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**భాష్యం పాఠశాలలో విద్యార్థుల యోగాసనాలు**

మండల కేంద్రమైన రాయవరం భాష్యం పాఠశాలలో సైతం అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల పిఈటి శివాజీ రాజు విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి, వివిధ ఆసనాలను చేయించారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన విధానానికి యోగా ఎంతో అవసరమని, విద్యార్థులలో ఆరోగ్యం, క్రమశిక్షణ, ఏకాగ్రత పెంపొందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. పాఠశాల అధ్యాపక సిబ్బంది తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

### రామన్నపాలెంలో పేకాట శిబిరంపై

# పోలీసుల దాడి

## 8 మంది అరెస్ట్.. రూ.4,100 నగదు స్వాధీనం



**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్** : గోకవరం మండలం రామన్నపాలెం గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4,100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు గోకవరం ఎస్సై వి.ఎన్.వి. పవన్ కుమార్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై పవన్ కుమార్ తన సిబ్బందితో కలిసి గ్రామ శివారులోని ఓ ప్రాంతంలో దాడి నిర్వహించగా, కొందరు వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. ఘటన స్థలంలో ఉన్న నగదును స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్సై పవన్ కుమార్ మాట్లాడుతూ, పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలు సమాజానికి హానికరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల పరిధిలో ఎక్కడైనా పేకాట, జూదం లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే తన మొబైల్ నంబర్ 9440904830కు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

### ఫీజుల కోసం కాదు..

# విద్యార్థుల భవిష్యత్తు కోసమే రాజా పబ్లిక్ స్కూల్




**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్** : నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, అనుకూలమైన ఫీజులతో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ముందంజలో నిలుస్తోంది రాజా పబ్లిక్ స్కూల్. 45 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ విద్యాసంస్థలో చదువుకున్న వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి దేశ విదేశాల్లో ప్రముఖ స్థానాల్లో స్థిరపడటం విశేషం. సుమారు 1500 మంది విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్న రాజా పబ్లిక్ స్కూల్ యాజమాన్యం, ఫీజుల వసూలే లక్ష్యం కాదని, ప్రతి విద్యార్థి జీవితంలో విజయం సాధించాలనే ఉద్దేశంతోనే పాఠశాలను నిర్వహిస్తున్నామని పేర్కొంది. విద్యార్థులను సొంత పిల్లలుగా భావిస్తూ వారి వ్యక్తిత్వ వికాసం, విద్యా ప్రగతి, నైతిక విలువల పెంపుదలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపింది. విశాలమైన ప్రాంగణం, ప్రశాంతమైన వాతావరణం, ఆధునిక సౌకర్యాలు, క్రమశిక్షణతో కూడిన విద్యా విధానం ఈ పాఠశాలకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. విద్యార్థుల ప్రతిభను వెలికితీసే విధంగా తరగతులు నిర్వహిస్తూ, చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ప్రోత్సాహం అందిస్తున్నారు. ఇతర పాఠశాలలతో పోలిస్తే అనుకూలమైన ఫీజులతో నాణ్యమైన విద్య అందుతుండటంతో తమ పిల్లలను రాజా పబ్లిక్ స్కూల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తూ, విద్యా రంగంలో మరో మైలురాయిని అధిగమించిన రాజా పబ్లిక్ స్కూల్‌పై స్థానిక ప్రజలు, తల్లిదండ్రులు ప్రశంసలు కురిపిస్తున్నారు. "ఫీజుల కోసం కాదు... విద్యార్థుల భవిష్యత్తు కోసం" అనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న రాజా పబ్లిక్ స్కూల్, విద్యా ప్రమాణాల్లో ఆదర్శంగా నిలుస్తోంది.

# సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన బొడ్డు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్** : సీతానగరం మండలంలోని పలు గ్రామాల్లో రూడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి ముఖ్యమంత్రి సహాయనిధి (సిఎం ఆర్ ఎఫ్) చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. చినకొండేపూడి గ్రామంకు చెందిన బూరుగపల్లి అనసూయకు రూ.1,41,088/- లు,చంద్రు అనం తలక్ష్మి కృష్ణవేణి కి రూ.95,121/- లు, కాటవరం గ్రామంకు చెందిన గెడ్డం పుష్ప కు రూ.41,450/లు,గుడపాటి వరలక్ష్మికి రూ.76,310/- లు,బొబ్బిలంక గ్రామానికి చెందిన తూముల నాగ మణికి రూ.84,037/- లు,నాగ లక్ష్మి కి రూ.17,114/- లు,కాకిలేటి సూరమ్మకు రూ.87,340/-లు, కవడి బాబికి రూ.81,311/- లు,ములకల్లంక గ్రామానికి చెందిన బొడ్డు సత్యనారాయణకు రూ.54,258/- లు,వంగలపూడి గ్రామానికి చెందిన తురుమల్ల దుర్గాలక్ష్మికి రూ.25,000/-లు , ముగ్గళ్ల గ్రామంకు చెందిన తన్నీరు మునికోటేశ్వరరావు కు రూ.32,714/-లు, వెదులపల్లి గ్రామానికి చెందిన దండిమూడి మురళీకృష్ణ భగవాన్ కు రూ.70,000/-లు ,మునికూడలి గ్రామానికి చెందిన కొంగల శివసూర్యభాస్కరరావు కు రూ.2,01,540/-ల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బొడ్డు వెంకట రమణ చౌదరి మాట్లాడుతూ ప్రజలకు అవసర మైన సమయంలో ప్రభుత్వం అండగా నిలబడటం ముఖ్య మని పేర్కొన్నారు. వలబ్ధిదారులు ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు.

### జిల్లా కోర్టు నూతన భవన సముదాయంలో

# అంతర్జాతీయ యోగా దినోత్సవం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్** : తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జిల్లా కోర్టు నూతన భవన సముదాయంలో ఆదివారం 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కామన్ యోగా ప్రోటోకాల్‌ను అనుసరించి యోగా సాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కోర్టులకు చెందిన న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు, జిల్లా న్యాయ సేవా సంస్థ (డీఎల్ఎస్ఏ) సిబ్బంది, కోర్టు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని యోగా ఆసనాలు, ప్రాణాయామం, ధ్యాన సాధన నిర్వహించారు. నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకోవడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఒత్తిడి తగ్గి సమతుల్య జీవనశైలి అలవడుతుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.

# ఎమ్మెల్యే ఆదేశాలతో నల్లచెరువు పూడికతీత




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్** : సీతానగరం మండలం రాపాక,రఘుదేవపురం, నల్లగొండ,చిన కొండేపూడి,మిర్తిపాడు వంటి పలు గ్రామాల రైతుల కోరిక మేరకు రాజానగరం నియోజకవర్గ జనసేన పార్టీ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆదేశాలతో నల్ల చెరువు పూడిక తీతను 9 లక్షల 50 వేల నిధులతో 5200 మీటర్ల మేర కాలువ పూడికతీతను ప్రారంభించడంతో ఆయకట్టు పలు గ్రామాల రైతులు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కాలువ పూడిక తీత ఏళ్ల తరబడి నోచుకోకపోవడంతో ఖరీఫ్ సీజన్లో రైతులు ఎదుర్కొంటున్న నీటి ఎద్దడి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్ళగానే తక్షణమే స్పందించారని తొర్రిగడ్డ వైస్ చైర్మన్ శ్రీ మందపాటి జగపతి రాజు అన్నారు. సీతానగరం మండలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి ఎమ్మెల్యే ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న నాయకుడిగా మండల ప్రజల మనసులో చెరగని ముద్ర వేసుకున్నారని ఈ సందర్భంగా గుర్తు ఆయన చేశారు. మండల ప్రజల,రైతుల సమస్యలు కార్యకర్తల ద్వారా ఎమ్మెల్యే దృష్టికి వెళ్లగానే దగ్గరుండి రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకూ నిద్రాహారాలు మాని పనిచేస్తున్నారని విలేకరులకు తెలుపుతూ ఇలాంటి ఎమ్మెల్యే రాజానగరం నియోజకవర్గంలో అభివృద్ధి దిశగా పనిచేయడంపై ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కాలువ పూడిక తీతను దగ్గరుండి పని చేయించుటలో తొర్రిగడ్డ చైర్మన్ వేగి శ్రీను, తొర్రిగడ్డ వైస్ చైర్మన్ శ్రీమందపాటి జగపతి రాజు,కాలవ ప్రెసిడెంట్ కొనే శ్రీను,శ్రీమంధపటి నరేంద్ర వర్మ,ముత్యాల మహేష్ తదితర కూటమి నాయకులు చురుకుగా పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో వీరాడపు హనుమంతు తదితర రైతులు పాల్గొన్నారు.

# యోగాతో ఆరోగ్యవంతమైన దేశ నిర్మాణమే లక్ష్యం

**యోగాతో ఆరోగ్యమే మహాభాగ్యం - కోటిలింగాల ఘాట్‌లో ఘనంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం**
**ఒత్తిడికి యోగా దివ్యౌషధం - ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి, కలెక్టర్ కీర్తి చేకూరి**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగానే ఉత్తమ మార్గమని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం కోటిలింగాల ఘాట్‌లో ఆయుష్ శాఖ, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'యోగాంధ్ర' కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి మాట్లాడుతూ, ప్రజలందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపాదనతో ఐక్యరాజ్యసమితి 2014లో జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించిందని గుర్తు చేశారు. భారతీయ సంస్కృతికి ప్రతీకైన యోగా ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యకరమైన జీవనశైలికి మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన యోగా సాధకులు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సామూహికంగా యోగాసనాలు వేయడం ఆకట్టుకుంది. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ యోగా సర్వరోగ నివారిణిగా పనిచేస్తుందని, ప్రతిరోజూ 45 నిమిషాల పాటు యోగా సాధన చేస్తే శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. ప్రాణాయామం, ధ్యానం వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గడంతో పాటు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయని చెప్పారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ యోగా ద్వారా ప్రపంచ దేశాలు భారతదేశాన్ని విశ్వగురువుగా గుర్తించాయని పేర్కొన్నారు. 12 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం "శీస్త్రుఖ టశీతీ ఎముశ్రీష్త్రం చాస్త్రవఱఅస్త్ర" అనే అంశంతో నిర్వహించడం జరిగిందన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసిక స్థైర్యం, ఏకాగ్రత పెంపొందించడంలో యోగాభ్యాసం కీలకమని చెప్పారు. యోగా జిల్లా నోడల్ అధికారి, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ మాట్లాడుతూ యువత ఆరోగ్యంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని, ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, అనారోగ్య సమస్యలకు యోగా సమర్థవంతమైన పరిష్కారమన్నారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ మాట్లాడుతూ.. యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వారసత్వమని అన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగానే ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రోజూ కొంత సమయం యోగా సాధనకు కేటాయిస్తే శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు. యువత నుంచి వృద్ధుల వరకు అందరూ యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సృష్టి క్రమ, శిక్షణ క్రమ, రక్షణ క్రమ, ఆధ్యాత్మిక క్రమ, చికిత్స క్రమ అనే ఐదు రకాల యోగా సాధనలను ప్రదర్శించారు. అనంతరం బ్రహ్మ కుమారీస్‌కు చెందిన స్రవంతి, మౌనిక ధ్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన చిన్నారులు, యోగా గురువులను అతిథులు మెమెంటోలు, దుశ్శాలువాలతో సత్కరించారు. యోగా గురువు పరియా రామచంద్రరావు ఆధ్వర్యంలో యోగాభ్యాసం నిర్వహించారు.

**ఐదు రకాల యోగా సాధనపై అవగాహన**

కార్యక్రమంలో యోగా గురువు పరియా రామచంద్రరావు ఆధ్వర్యంలో సృష్టి క్రమ, శిక్షణ క్రమ, రక్షణ క్రమ, ఆధ్యాత్మిక క్రమ, చికిత్స క్రమ అనే ఐదు రకాల యోగా సాధన విధానాలను వివరించారు. సృష్టి క్రమ ద్వారా శరీరానికి చైతన్యం, శిక్షణ క్రమ ద్వారా శారీరక దృఢత్వం, రక్షణ క్రమ ద్వారా రోగ నిరోధక శక్తి పెంపు, ఆధ్యాత్మిక క్రమ ద్వారా మానసిక ప్రశాంతత, చికిత్స క్రమ ద్వారా వివిధ ఆరోగ్య సమస్యల నివారణకు యోగా ఎలా దోహదపడుతుందో వివరించి అవగాహన కల్పించారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తే సంపూర్ణ ఆరోగ్యం, మానసిక సమతుల్యత సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో గైట్ యూనివర్సిటీ ఛైర్మన్ కె.వి.వి. సత్యనారాయణ రాజు (చైతన్యరాజు), ప్రజాప్రతినిధులు కూడిపూడి సత్తిబాబు, యానాపు యేసు, ఆయుష్ సమన్వయకర్త డా. విజయకుమారి, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. భాస్కర్‌రెడ్డి, ఆర్ఎంసీ అదనపు కమిషనర్ పి.వి. రామలింగేశ్వరరావు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎన్. వసుంధర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. తొలుత శాంతి జపంతో ప్రారంభించి కార్యక్రమం యోగా సంకల్పంతో ముగిసింది.


# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**లక్ష్య సాధనలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు : జిల్లా ఎన్నికల అధికారి కీర్తి చేకూరి**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా తూర్పుగోదావరి జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి కీర్తి చేకూరి ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్‌వోలు), అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఏఈఆర్‌వోలు), బీఎల్‌వో సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతి పై సమీక్షించారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 18,46,723 మంది ఓటర్లలో 9,32,772 మందికి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయగా, ఇది 50.51 శాతం మాత్రమే నమోదైంది. డిజిటలైజేషన్ ప్రక్రియలో కేవలం 8,004 ఫారాలు మాత్రమే నమోదు కావడంతో పురోగతి 0.43 శాతంగా ఉండటంపై జిల్లా ఎన్నికల అధికారి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు తమ పరిధిలోని ప్రతి బీఎల్‌వో, సూపర్‌వైజర్ వారీగా రోజువారీ సమీక్షలు నిర్వహించి పనితీరును మెరుగుపరచాలని ఆదేశించారు. జూన్ 25 నాటికి ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి చేసి, అనంతరం డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ సందర్భంగా ప్రతి ఓటరిని తప్పనిసరిగా గుర్తించి ఫారం అందజేయాలని, చిరునామా మారిన ఓటర్లను కొత్త చిరునామాలో గుర్తించి ఫారం అందించాలని, ఇతర నియోజకవర్గాలకు మారిన వారి వివరాలను నమోదు చేయాలని, అందుబాటులో లేని ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని, మరణించిన ఓటర్ల వివరాలు ప్రత్యేకంగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్ర పరిధిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అవసరమైతే అన్ని శాఖలతో పాటు బీఎల్ఏల సహకారాన్ని కూడా తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో వేగం పెంచేందుకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, ఐసీడీఎస్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, డీడబ్ల్యూఎంఏ ఫీల్డ్ అసిస్టెంట్లు, డీఆర్‌డీఏ, మెప్మా సిబ్బంది, కొవ్వూరు, నిడదవోలు, మండపేట మున్సిపాలిటీల సిబ్బందిని భాగస్వామ్యం చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. లక్ష్య సాధనలో నిర్లక్ష్యం ప్రదర్శించిన గోపాలపురం, రాజమహేంద్రవరం సిటీ, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గాలకు చెందిన బీఎల్‌వోలు, బీఎల్‌వో సూపర్‌వైజర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణ కోరినట్లు తెలిపారు. వివరణ సంతృప్తికరంగా లేకపోతే ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పూర్తి నిబద్ధతతో నిర్వహించి జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలపాలని జిల్లా ఎన్నికల అధికారి అన్ని ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలు, బీఎల్‌వో సూపర్‌వైజర్లు, ఎన్నికల యంత్రాంగానికి సూచించారు.

# యోగా శరీరానికి ఆరోగ్యం, మనసుకు ఆహ్లాదం

**గౌతమీ ఘాట్‌లో ఆదిత్య డిగ్రీ కళాశాలల వాలంటీర్లతో యోగాంధ్ర**






**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలల ఎన్.ఎస్.ఎస్, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ జి వి ఎస్ నాగేశ్వర రావు స్ఫూర్తితో ఆదివారం ఉదయం గౌతమీ ఘాట్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆదిత్య కళాశాలలో శిక్షణ ఇచ్చిన వివిధ యోగాసనాలు, శ్వాస మీద ధ్యాస వంటి కార్యక్రమాలు వాలంటీర్లు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో గౌతమి ఘాట్ ప్రెసిడెంట్ కీర్తి అచ్చిరాజు, వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు, సెక్రటరీ గుని శెట్టి విజయ కిరణ్, ట్రెజరర్ తుమ్మలపల్లి బాబురావు, రిటైర్డ్ ఎల్ఐసి ఆఫీసర్ లక్ష్మణరావు, ఏబీవీపీ సత్య పాల్గొనగా, యోగా ట్రైనర్ ఎం.వినయ్ కుమారి పర్యవేక్షించారు. ఆదిత్య ఎన్ఎస్ఎస్ డీ న్,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మరియు ఇండియన్ యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.వి. ఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ యోగా శరీరానికి మనసుకు కూడా ఆరోగ్యాన్ని ఇచ్చి ఆహ్లాదం కలిగిస్తుందని తాను ప్రతి రోజు నాలుగు గంటలకు లేచి యోగా వాకింగ్ తదితర కార్యక్రమాలు చేయడం వల్లనే ఇంత ఆరోగ్యంగా ఉన్నానని చెప్పారు. ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన మరో ప్రోగ్రాం ఆఫీసర్ మరియు యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి హెచ్ వి రమాదేవి మాట్లాడుతూ మన హైందవ ధర్మం ఆర్ష ధర్మం యోగాతో ముడిపడిందని, ఇది మనకు పూర్వం నుండి పారంపర్యంగా వస్తుందని, మన యోగా గొప్పతనం దేశ దేశాలు విఖ్యాతి చెందిందని నేడు ఐక్యరాజ్యసమితి దాకా కీర్తి బావుటాను ఎగరవేయడానికి ప్రధాని మోడీ యొక్క ఉత్తమ ఆశయే సాధనలే కారణమని ఈ సందర్భంగా తెలిపారు.

# ఘనంగా అంతర్జాతీయ యోగాంధ్ర దినోత్సవం



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆరోగ్యమే మహాభాగ్యం అనే సూక్తిని ఆచరణలో పెట్టేందుకు ప్రతి సంవత్సరం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా నిర్వహించుకుంటున్నామని దీనిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు ఏపీఆర్ చౌదరి అన్నారు. ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని కోరుకొండ సరస్వతి విద్యానికేతన్ లో నిర్వహించిన యోగా కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ నాయకులు ఏపీఆర్ చౌదరి, అడపా సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీఆర్ చౌదరి మాట్లాడుతూ యోగా మన శారీరక, మానసిక ఆరోగ్య పరిస్థితులను సమతుల్యం చేస్తూ,ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని పెంపొందించే గొప్ప భారతీయ సంప్రదాయం. సరస్వతి విద్యానికేతన్ అధినేత పెనకటి గంగాధర్ మాట్లాడుతూ యోగ విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరు అలవర్చుకుంటే శరీర దారుణ్యానికి, ఏకగ్రహతతో పాటు చదువుల్లో చక్కగా రాణించడానికి దోహదపడుతుందన్నారు. అదేవిధంగా గుమ్ములూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గంగభవాని ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు అడపా సుధీర్, తనకాల నాయుడు, ఓలేటి వెంకన్న బాబు,చిటికెన భాస్కరరావు,కొవ్వాడ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**యోగా ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో**

# భాగం కావాలి : ఎంపీడీవో బత్తిన



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతి వ్యక్తి దైనందిన జీవితంలో యోగా తప్పనిసరిగా భాగం కావాలని కోరుకొండ మండల అభివృద్ధి అధికారి బత్తిన అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఎంపీడీవో అశోక్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీరస్తు కళ్యాణ మండపంలో మండలస్థాయి అధికారులతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బత్తిని మాట్లాడుతూ నేడు ఆరోగ్యాన్ని మించిన మహాభాగ్యం మరొకటి లేదన్నారు. ప్రతి వ్యక్తి తన దైనందిన జీవితంలో వయస్సు తారతమ్యం లేకుండా అనునిత్యం అనేక రుగ్మతలతో బాధపడుతున్నారని, వీటన్నింటిని అధిగమించడానికి యోగాను మించిన దివ్య ఔషధం మరొకటి లేదన్నారు. తాసిల్దార్ సునీత మాట్లాడుతూ ప్రతి వ్యక్తి క్రమం తప్పకుండా ప్రతిరోజు యోగాతో పాటు నడకకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. దీంతో శరీరంలో ఎన్నో రుగ్మతలు తొలగుతా యన్నారు. అందువల్లే ప్రతి సంవత్సరం జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకుంటు న్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖఅధికారి కుశలోవ దొర, ఏవో సామ్యూల్, సెక్రటరీలు, ఎంపీడీవో రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, ఎన్డీఏ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది : కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం కేంద్రంలో ఆదివారం జూన్ 21న నిర్వహించిన నీట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష నిర్వహణకు అన్ని కేంద్రాల్లో పటిష్ఠ ఏర్పాట్లు చేసి, బయోమెట్రిక్ నమోదు, సీసీ కెమెరాలు, జామర్లు, భద్రతా చర్యలను సమర్థవంతంగా అమలు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 9 పరీక్షా కేంద్రాల్లో 3,363 మంది అభ్యర్థులకు పరీక్ష నిర్వహించగా, 3,066 మంది హాజరయ్యారని, 297 మంది గైర్హాజరయ్యారని ఆమె తెలిపారు. మొత్తం హాజరు శాతం 91.17 శాతంగా నమోదైనట్లు వెల్లడించారు. పరీక్ష నిర్వహణలో సహకరించిన అధికారులు, సిబ్బంది, పోలీసు శాఖ, వైద్య సిబ్బంది, విద్యుత్, రవాణా తదితర శాఖల అధికారులను కలెక్టర్ అభినందించారు.

**కేంద్రాల వారీగా హాజరు వివరాలు:**

ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల – 576 మందికి గాను 526 మంది హాజరు
ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (అటానమస్) – 507 మందికి గాను 457 మంది హాజరు
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల – 504 మందికి గాను 460 మంది హాజరు
కేంద్రీయ విద్యాలయ, ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్ – 360 మందికి గాను 328 మంది హాజరు
ఎస్‌కేవీటీ ఈఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల – 360 మందికి గాను 329 మంది హాజరు
ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల – 288 మందికి గాను 261 మంది హాజరు
దానవాయిపేట మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ – 264 మందికి గాను 244 మంది హాజరు
నెహ్రూనగర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ – 264 మందికి గాను 236 మంది హాజరు
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ – 240 మందికి గాను 225 మంది హాజరు

# "యోగం చేయండి - ఆరోగ్యంగా జీవించండి"

**అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన పార్డ్ ఇండియా, లయన్స్ క్లబ్**




**దూబచర్ల, విశ్వం వాయిస్ న్యూస్ :** పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ, లయన్స్ క్లబ్ దూబచర్ల సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు శ్రీ సంఘమిత్ర విద్యాలయం ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నల్లజర్ల మండల ఎంపీడీవో పి.ఎస్.ఎస్. సింహాద్రిరావు ముఖ్య అతిథిగా హాజరుకాగా, దూబచర్ల గ్రామ సచివాలయ కార్యదర్శి ఆశ అలేఖ్య ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ యోగా గురువు డి. రాజారావు యోగా ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తూ పలు యోగా ఆసనాలను ప్రదర్శించారు. యోగా ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సింహాద్రిరావు, గ్రామ కార్యదర్శి ఆశ అలేఖ్య చేతుల మీదుగా యోగా గురువు డి.రాజారావును ఘనంగా సన్మానించి, యోగా రంగంలో ఆయన అందిస్తున్న సేవలను ప్రశంసించారు. పార్డ్ ఇండియా జాతీయ అధ్యక్షులు, శ్రీ సంఘమిత్ర విద్యాలయ కరస్పాండెంట్ ఒ డైరెక్టర్ అంబటి శ్రీనివాసరావు మాట్లాడుతూ, యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వారసత్వమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకుని ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్డ్ ఇండియా జాయింట్ కోఆర్డినేటర్ సోమిశెట్టి వెంకటరావు, సంఘమిత్ర విద్యాలయ ప్రిన్సిపాల్ కెల్లా వంశీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, లయన్స్ క్లబ్ సభ్యులు, పార్డ్ ఇండియా ప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యోగాంధ్ర రోజున స్వర్ణాంధ్ర రాగి మాల్ట్ పంపిణీ




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ యోగదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కోటిలింగాల ఘాట్ వద్ద జరిగిన యోగాలో పాల్గొన్న వారికి స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సంస్థ రాగి మాల్ట్ పంపిణీ చేసింది. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర నిర్వాహకులు రాంబాబు మాట్లాడుతూ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగే కార్యక్రమాల్లో గత కొన్ని ఏళ్లుగా సంవత్సరాలుగా స్వర్ణాంధ్ర సేవా సంస్థ రాగి మాల్ట్ అందిస్తూ వస్తుందన్నారు. నగరంలో జరిగే అనేక సేవా కార్యక్రమాల్లో స్వర్ణాంధ్ర తన వంతుగా సేవలందిస్తూ అందరి మన్ననలు పొందుతుందని రాంబాబు తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందితో పాటు స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవకులు రాగి మాల్ట్ పంపిణీలో పాల్గొన్నారని, వారికి రాంబాబు అభినందనలు తెలిపారు. స్వర్ణాంధ్ర నిర్వహణకు సహకరిస్తున్న దాతలందరికీ రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు.

# రూ.10 కోట్లతో నిర్మిస్తున్న నూతన వంతెనపై ప్రజల్లో అసంతృప్తి




**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతానికి ముఖద్వారంగా పేరుగాంచిన గోకవరం మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న నూతన వంతెనపై స్థానిక ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బ్రిటిష్ కాలం నాటి సుమారు 119 సంవత్సరాల చరిత్ర కలిగిన పాత ఇరుకు వంతెన వద్ద ప్రతిరోజూ వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుండేది. దీంతో వాహనదారులు, విద్యార్థులు, ఉద్యోగులు, స్థానిక ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం రూ.10 కోట్ల వ్యయంతో నూతన వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. అయితే హైవేపై మలుపులు లేకుండా నేరుగా వంతెన నిర్మిస్తారని భావించిన ప్రజలకు, ప్రస్తుతం చేపడుతున్న నిర్మాణం నిరాశ కలిగించిందని పలువురు అంటున్నారు. ఎస్ ఆకారంలో వంతెన నిర్మాణం చేపట్టడంతో భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు కొనసాగుతాయని వారు అభిప్రాయపడుతున్నారు. వంతెన నిర్మాణ వ్యయంపై కూడా గ్రామంలో చర్చ జరుగుతోంది. మొత్తం రూ.10 కోట్ల నిధులు మంజూరైనప్పటికీ, నిర్మాణ వ్యయం తక్కువగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మిగిలిన నిధుల వినియోగంపై పారదర్శకత అవసరమని కొందరు ప్రజలు కోరుతున్నారు. అలాగే వంతెన నిర్మాణంలో ఉపయోగిస్తున్న సామగ్రి నాణ్యతపై కూడా కొందరు స్థానికులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ పనులను సంబంధిత అధికారులు సాంకేతికంగా పరిశీలించి, నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు. హైవే రహదారిపై మలుపులతో కూడిన వంతెన నిర్మాణం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అధికారులు స్పందించి నిర్మాణంపై పూర్తి వివరాలు వెల్లడించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**శీర్షికల సూచనలు:**

రూ.10 కోట్ల వంతెన నిర్మాణంపై గోకవరంలో చర్చ
ఎస్ ఆకారపు వంతెనపై ప్రజల అసంతృప్తి
నూతన వంతెన నిర్మాణంలో నాణ్యత, వ్యయంపై ప్రశ్నలు
గోకవరం బ్రిడ్జి: ప్రజల ఆశలు నెరవేరుతాయా?




## పెళ్లిపై తన అభిప్రాయాన్ని
# నిక్కచ్చిగా చెప్పిన నందిని రెడ్డి



దర్శకురాలు నందిని రెడ్డి ఓ ఇంటర్వ్యూలో తన ఆరేళ్ల పోరాటాన్ని, అలా మొదలైంది సినిమా విడుదలకు ముందు ఎదుర్కొన్న ఆర్థిక కష్టాలను పంచుకున్నారు. ఆమె వ్యక్తిగత శైలి, సౌకర్యానికి ప్రాధాన్యత, వివాహం గురించి తన నిక్కచ్చి అభిప్రాయాలను వెల్లడించారు. ఒంటరితనం లేదని వివరించారు. తెలుగు సినీ దర్శకురాలు నందిని రెడ్డి ఓ ఇంటర్వ్యూలో తన సినీ కెరీర్, వ్యక్తిగత జీవితంపై అనేక ఆసక్తికర విషయాలను వెల్లడించారు. తన మొదటి సినిమా అలా మొదలైంది స్క్రిప్ట్ చెప్పే సమయం నుంచి విడుదలకు దాదాపు ఆరేళ్ల సమయం పట్టిందని, ఈ కాలం తన జీవితంలో అత్యంత కష్టమైన దశ అని ఆమె పేర్కొన్నారు. తన స్నేహితులు డాక్టర్లుగా స్థిరపడి, ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న సమయంలో తాను మాత్రం సినిమా కోసం పోరాడాల్సి వచ్చిందని, అప్పుడప్పుడు తాను తప్పు చేశానా అని కూడా అనిపించేదని నందిని రెడ్డి గుర్తుచేసుకున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడినప్పుడు, స్నేహితులు బిల్లులు కట్టేవారని, తాను పాకెట్ మనీ కోసం వరల్డ్ స్పేస్ కంపెనీలో రేడియో జాకీగా పనిచేసినట్లు తెలిపారు. అప్పుడు నెలకు 20,000 రూపాయలు వచ్చేదని, వాటితో తన టూ-వీలర్ పెట్రోల్ ఖర్చులు పోగా, కొంత మిగిలేదని వివరించారు. అలా మొదలైంది సినిమా కోసం మొదట 5 లక్షల రూపాయలు రెమ్యునరేషన్‌గా ఇచ్చారని, తరువాత తమిళ రైట్స్ అమ్ముడయ్యాక 20 లక్షలు అదనంగా లభించాయని ఆమె చెప్పారు. ఈ డబ్బుతో తన తల్లి పదేళ్ల పాత అప్పును తీర్చినట్లు నందిని రెడ్డి తెలిపారు. అప్పట్లో రౌడీ షీటర్లు ఇంటికి వచ్చి బెదిరించేవారని, సినిమా రిలీజ్ అయిన తర్వాత డబ్బు ఇస్తానని నమ్మకంగా చెప్పి వారిని పంపించేసి, సినిమా హిట్ అయ్యాక నిర్మాత దాము గారి నుంచి డబ్బు తీసుకొని అప్పు తీర్చినట్లు వివరించారు.

**శైలి, సౌకర్యానికి ప్రాధాన్యత**

తన డ్రెస్సింగ్ స్టైల్ గురించి మాట్లాడుతూ, నందిని రెడ్డి ఎప్పుడూ సౌకర్యానికే పెద్ద పీట వేస్తానని స్పష్టం చేశారు. జుట్టు చిక్కు తీసేటప్పుడు నొప్పి రాకుండా బాయ్ కట్ చేసుకోవడం, క్రీడలు ఆడేటప్పుడు, బైక్ నడిపేటప్పుడు ప్యాంట్లు సౌకర్యవంతంగా ఉండటం వంటివి తన వ్యక్తిగత శైలిపై ప్రభావం చూపాయని చెప్పారు. స్టైల్ కంటే కంఫర్టే ముఖ్యమని, మేకప్, లిప్‌స్టిక్‌లపై తనకు ఆసక్తి లేదని నందిని రెడ్డి తెలిపారు. చీరల్లో తన స్ట్రైడ్ (నడిచే విధానం) సాధ్యం కాదని, అవి అసౌకర్యంగా అనిపించడంతో వాటిని మానేశానని పేర్కొన్నారు.

**వివాహం, సంబంధాలపై అభిప్రాయాలు**

పెళ్లి గురించి అడగ్గా, నందిని రెడ్డి తనకు పెళ్లి చేసుకోవాలని కచ్చితంగా లేదని, చేసుకోకూడదని కూడా లేదని అన్నారు. నెవర్ నో, ఎవరైనా దొరికితే చేసుకుంటానేమో అని నవ్వుతూ చెప్పారు. కాలేజీ రోజుల్లో (జేఎన్‌యూలో) డేటింగ్ జరిగిందని, కానీ అవి పెళ్లి వరకు వెళ్లలేదని తెలిపారు. సినీ పరిశ్రమకు వచ్చాక, దర్శకురాలిగా తన కెరీర్ చాలా డిమాండింగ్‌గా ఉండటం వల్ల, తమ వృత్తిని అర్థం చేసుకునే వ్యక్తి ఇంకా తారసపడలేదని చెప్పారు. తనకు సినిమా పరిశ్రమ బయట నుంచి పెళ్లి ప్రపోజల్స్ వచ్చాయని, కానీ అవి సరైనవిగా అనిపించలేదని తెలిపారు. తాను తన వృత్తి పట్ల చాలా సీరియస్‌గా ఉంటానని, తనకు పెళ్లి విషయంలో ఎటువంటి వెలితి లేదని నందిని రెడ్డి అన్నారు. తన తల్లితో కలిసి నివసిస్తుండటం వల్ల ఒంటరితనం అనే భావన లేదని స్పష్టం చేశారు. చిన్నతనం నుండి తనకు తన సొంత కంపెనీ అంటే చాలా ఇష్టమని, పుస్తకాలు ఇస్తే గంటల తరబడి గదిలోనే గడిపేస్తానని తెలిపారు. తన బెస్ట్ ఫ్రెండ్స్ ఇప్పటికీ తన స్కూల్, కాలేజీ స్నేహితులేనని, వారే తనను గ్రౌండెడ్‌గా ఉంచుతారని, తనను దర్శకురాలిగా కాకుండా స్నేహితురాలిగానే చూస్తారని నందిని రెడ్డి పేర్కొన్నారు.

# భారీగా పెరిగిన విష్ణుప్రియ ఇన్‌స్టాగ్రామ్ సబ్ స్క్రైబర్స్..
### ఇప్పుడు నెల ఆదాయం ఎంతో తెలిస్తే షాక్ అవుతారు



టీవీ షోస్, ప్రోగ్రామ్స్ తో బిజీగా ఉండే యాంకర్ విష్ణు ప్రియ తరచూ వివాదాలతోనూ వార్తల్లో నిలుస్తోంది. ముఖ్యంగా ఇటీవల ఆమె చేసిన కొన్ని కామెంట్స్ హాట్ టాపిక్ గా మారాయి. అయితే ఇదే సమయంలో ఆమె ఇన్‌స్టాగ్రామ్ పెయిడ్ సబ్ స్క్రైబర్ల సంఖ్య అనూహ్యంగా పెరిగిపోయింది. ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఇన్‌స్టాగ్రామ్ తన యూజర్ల కోసం తీసుకొచ్చిన సబ్ స్క్రిప్షన్ ప్లాన్ సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లకు వరంగా మారింది. ముఖ్యంగా సెలబ్రిటీలు ఎక్స్‌క్లూజివ్ కంటెంట్ అంటూ రోజు రోజుకు తమ సబ్ స్క్రైబర్లను పెంచుకుంటున్నారు. గ్లామరస్ ఫొటోలు, వీడియోలను షేర్ చేస్తూ భారీగానే ఆదాయం సమకూర్చుకుంటున్నారు. టాలీవుడ్ కు ఈ ఇన్‌స్టాగ్రామ్ పెయిడ్ సబ్ స్క్రిప్షన్ ను పరిచయం చేసింది యాంకర్ విష్ణు ప్రియనే అని చెప్పవచ్చు. ఆమె తర్వాత అనన్య నాగళ్ల, అషు రెడ్డి, బిగ్ బాస్ సిరి.. ఇలా చాలా మంది ఇన్ స్టా గ్రామ్ పెయిడ్ సబ్ స్క్రిప్షన్ స్టార్ట్ చేశారు. అయితే వీరందరిలో ఇప్పుడు విష్ణు ప్రియనే హాట్ టాపిక్ అవుతోంది. ఇటీవల కాలంలో తన కామెంట్స్, సోషల్ మీడియా పోస్టులతో తరచూ వివాదాల్లో చిక్కుకుంటోందీ యాంకరమ్మ. అయితే ఈ కాంట్రవర్సీలే ఆమెకు కాసుల వర్షాన్ని కురిపిస్తున్నాయని తెలుస్తోంది. గత కొన్ని రోజులుగా విష్ణు ప్రియ ఇన్ స్టాగ్రామ్ సబ్ స్క్రైబర్ల అనూహ్యంగా పెరిగిపోయింది. ప్రస్తుతం ఈ ఫీచర్ ద్వారా విష్ణుప్రియను ఫాలో అవుతున్న వారి సంఖ్య 7,414కి చేరింది. విష్ణు ప్రియ తన ఇన్ స్టా గ్రామ్ సబ్ స్క్రిప్షన్ కోసం నెలకు రూ.390 ఫిక్స్ చేసింది. ఈ లెక్కన 7,414 సబ్ స్క్రైబర్ల ద్వారా ఆమెకు నెలకు ఏకంగా సుమారు రూ.28 లక్షల 91 వేల నెలవారీ ఆదాయం వస్తున్నట్లు సమాచారం. ఒక సాధారణ యాంకర్ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ద్వారా ఈ రేంజ్ లో ఆదాయం ఆర్జించడం నిజంగా ఆశ్చర్యమే. అయితే తన సబ్ స్క్రైబర్ల కోసం ఎక్స్ క్లూజివ్ కంటెంట్ అందించడంపై నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ కారణంగా సోషల్ మీడియాలో విష్ణు ప్రియను భారీగా ట్రోల్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే రీసెంట్ గా మరోసారి పోలీసులను ఆశ్రయించిందీ యాంకరమ్మ. తనపై సోషల్ మీడియాలో జరుగుతోన్న నెగెటివ్ ప్రచారానికి అడ్డు కట్ట వేయాలని పోలీసులను కోరింది. తన పరువు, ప్రతిష్టకు భంగం కలిగించేలా, వ్యక్తిత్వాన్ని హననం చేసేలా కంటెంట్‌ను వైరల్ చేస్తున్న కొన్ని సోషల్ మీడియా అకౌంట్లు, యూట్యూబ్ ఛానళ్లపై పోలీసులకు ఫిర్యాదు చేసింది.

# అంతరిక్షంలోకి దూసుకెళ్లిన ఫుట్‌బాల్..
## స్పేస్ స్టేషన్‌లో ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడిన వ్యోమగాములు




ఫిఫా వరల్డ్ కప్ 2026 అధికారిక మ్యాచ్ బాల్ ట్రియోండా అంతరిక్ష కేంద్రానికి చేరింది. నాసా వ్యోమగాములు స్పేస్ స్టేషన్‌లో ఫుట్‌బాల్‌పై ప్రయోగాలు నిర్వహించారు. అడిడాస్ రూపొందించిన ఈ హైటెక్ బాల్‌లో 500ఎఓ సెన్సార్, వీూ= టెక్నాలజీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. క్రీడా రంగంలో సరికొత్త టెక్నాలజీని జోడించడంలో ఫుట్‌బాల్ ప్రపంచకప్ ఎప్పుడూ ముందే ఉంటుంది. ఈ క్రమంలోనే త్వరలో జరగబోయే 2026 ఫిఫా వరల్డ్ కప్ అఫీషియల్ మ్యాచ్ బాల్ ట్రియోండా ఒక అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. ఈ సరికొత్త ఫుట్‌బాల్ భూమిని దాటి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకుంది. అమెరికా స్పేస్ ఏజెన్సీ నాసాకు చెందిన వ్యోమగాములు స్పేస్ స్టేషన్‌లో ఈ బంతిపై ప్రత్యేకమైన భౌతికశాస్త్ర ప్రయోగాలు నిర్వహిస్తూ దానికి సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు.

**శూన్యంలో ఫుట్‌బాల్ బ్యాలెన్స్ పై నాసా రీసెర్చ్**

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న క్రూ.. శూన్య గురుత్వాకర్షణ శక్తి (మైక్రో గ్రావిటీ)లో ఫుట్‌బాల్ డైనమిక్స్, దాని పర్ఫార్మెన్స్ ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి ఈ ప్రయోగాన్ని చేపట్టారు. గతంలో 2019లో చేసిన ఒక అధ్యయనాన్ని బేస్ చేసుకుని, ప్రఖ్యాత స్పోర్ట్స్ బ్రాండ్ అడిడాస్ తయారు చేసిన ఈ ట్రియోండా బంతి సెంటర్ ఆఫ్ మాస్ (ద్రవ్యరాశి కేంద్రం), బ్యాలెన్స్ దాని కదలికలను ఎలా ప్రభావితం చేస్తాయనే విషయాలను పరిశీలించారు. మైదానంలో ప్లేయర్లు కిక్ చేసినప్పుడు బంతి గాల్లో ఊహించిన విధంగా కదలాలంటే దాని బ్యాలెన్స్ ఎంత ఖచ్చితంగా ఉండాలో స్పోర్ట్స్ ఇంజనీర్లకు ఈ ప్రయోగం ద్వారా మరిన్ని లక్కీ హింట్స్ దొరికాయి.

**మూడు దేశాల ఐక్యతకు ప్రతీకగా ట్రియోండా**

ఈ ఫుట్‌బాల్ డిజైన్, పేరు వెనుక ఒక అద్భుతమైన కాన్సెప్ట్ ఉంది. ఫిఫా తెలిపిన వివరాల ప్రకారం.. ట్రియోండా అనే పదం స్పానిష్ భాష నుంచి వచ్చింది, దీని అర్థం మూడు తరంగాలు. చరిత్రలోనే మొదటిసారిగా 2026 లో మూడు దేశాలు (కెనడా, మెక్సికో, యునైటెడ్ స్టేట్స్) కలిసి సంయుక్తంగా ఈ వరల్డ్ కప్‌కు ఆతిథ్యం ఇస్తున్నాయి. ఈ మూడు దేశాల ఐక్యతను చాటిచెప్పేలా బంతిపై రెడ్, గ్రీన్, బ్లూ కలర్లను ఉపయోగించారు. అంతేకాకుండా, బంతిపై కెనడాకు చెందిన మేపుల్ లీఫ్, మెక్సికోకు చెందిన ఈగిల్, అమెరికాకు చెందిన స్టార్ సింబల్స్‌ను కూడా చాలా స్టైలిష్‌గా ముద్రించారు.

**బంతి లోపల హైటెక్ సెన్సార్ చిప్**

ట్రియోండా బంతి కేవలం చూడటానికే కాదు, సాంకేతికంగా కూడా ఎంతో అడ్వాన్స్‌డ్‌గా రూపొందించబడింది. ఈ బంతి లోపల 500ఎఓ మోషన్ సెన్సార్ చిప్?ను అమర్చారు. ఇది మ్యాచ్ జరుగుతున్నప్పుడు బంతి కదలికలకు సంబంధించిన రియల్ టైమ్ డేటాను వీడియో అసిస్టెంట్ రెఫరీ సిస్టమ్‌కు నిరంతరం పంపుతూ ఉంటుంది. దీనివల్ల గ్రౌండ్‌లో ఉండే అంపైర్లకు అత్యంత కఠినమైన ఆఫ్‌సైడ్ నిర్ణయాలు తీసుకోవడం, వివాదాస్పదమైన బాల్ లైన్ అవుట్ వంటి ఇన్సిడెంట్లలో ఖచ్చితమైన నిర్ణయాలు ప్రకటించడం చాలా సులువవుతుంది.

**స్పేస్ సైన్స్, క్రీడల అద్భుత కలయిక**

ఈ ప్రత్యేక ప్రయోగం గురించి నాసా ఇన్స్టాగ్రామ్‌లో స్పందిస్తూ.. "ప్రపంచంలోనే అత్యంత అందమైన ఫుట్‌బాల్ ఆటను మరింత మెరుగుపరచడం కూడా నాసా సైన్స్ లో ఒక భాగమే. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో మేము చేసే ఇలాంటి ప్రయోగాలు భూమిపై ఉన్న మానవుల జీవన ప్రమాణాలను, సాంకేతికతను మెరుగుపరచడానికి ఎంతగానో ఉపయోగపడతాయి" అని పేర్కొంది. స్పోర్ట్స్ సైన్స్, స్పేస్ రీసెర్చ్ కలయికతో జరిగిన ఈ ప్రయోగం, రాబోయే ఫిఫా వరల్డ్ కప్‌పై ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రీడాభిమానులలో మరిన్ని అంచనాలను, ఆసక్తిని పెంచేసింది.

# భారత్‌కు ఊహించని షాక్.. దక్షిణాఫ్రికా చేతిలో ఘోర పరాజయం.. సెమీస్ ఆశలపై ఎఫెక్ట్..?



క్రికెట్‌లో గెలుపోటములు సహజమే అయినా, ప్రపంచకప్ లాంటి పెద్ద వేదికపై ఇలాంటి కీలక మ్యాచ్‌లలో పరాజయం పాలవ్వడం భారత్‌కు పెద్ద హెచ్చరిక లాంటిదే. తదుపరి మ్యాచ్‌లలో భారత మహిళల జట్టు తమ తప్పులను సరిదిద్దుకుని, బ్యాటింగ్, ఫీల్డింగ్ విభాగాలలో మరింత పట్టుదల ప్రదర్శించి లీగ్ దశలో ముందంజ వేయాలని ఆశిద్దాం. మహిళల ప్రపంచకప్ వేదికపై భారత క్రికెట్ అభిమానులకు తీరని నిరాశ ఎదురైంది. మాంచెస్టర్ వేదికగా జరిగిన గ్రూప్ ఏ లీగ్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా మహిళల జట్టు చేతిలో భారత్ 6 వికెట్ల తేడాతో ఓటమి చవిచూసింది. లంకపై మన కుర్రాళ్లు సృష్టించిన పరుగుల పండగను మరువక ముందే మహిళల జట్టు ఇలా చేతులెత్తేయడం అభిమానులను కలచివేస్తోంది.

**ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో తడబడిన భారత బ్యాటింగ్..**

ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో గ్రూప్ ఏ లో భాగంగా జరిగిన 18వ మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 158 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఓపెనర్ షఫాలీ వర్మ ఆరంభంలోనే విరుచుకుపడి 15 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 31 పరుగులు చేసి మంచి ఊపు తెచ్చింది. అయితే మరో ఓపెనర్ స్మృతి మంధాన (17 పరుగులు) ఎక్కువ సేపు నిలబడలేకపోయింది. ఆ తర్వాత వచ్చిన యాస్తికా భాటియా (15 పరుగులు), జెమిమా రోడ్రిగ్స్ (12 పరుగులు) తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 22 బంతుల్లో 24 పరుగులు చేసి ఇన్నింగ్స్ నిలబెట్టే ప్రయత్నం చేసినా జట్టుకు భారీ స్కోరు అందించలేకపోయింది. చివర్లో దీప్తి శర్మ 21 బంతుల్లో 3 అద్భుతమైన ఫోర్లతో 29 పరుగులు చేయడంతో భారత్ కనీసం పోరాడే లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది.

**దక్షిణాఫ్రికాను గెలిపించిన మరిజానే కాప్ విశ్వరూపం..**

159 పరుగుల మోస్తరు లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా జట్టుకు భారత బౌలర్లు మొదట్లో గట్టి పోటీనే ఇచ్చారు. ఓపెనర్, కెప్టెన్ లారా వాల్వార్ట్ (20 పరుగులు), టాజ్మిన్ బ్రిట్స్ (40 పరుగులు) నిలకడగా ఆడుతున్న తరుణంలో భారత బౌలర్ శ్రీ చరణి అద్భుతమైన బౌలింగ్‌తో లంక లాంటి పతనాన్ని శాసించాలని చూసింది. శ్రీ చరణి ఏకంగా ముగ్గురు కీలక బ్యాటర్లను అవుట్ చేసి దక్షిణాఫ్రికాకు మునిగిపోయేలా చేసింది. కానీ మైదానంలోకి వచ్చిన వన్‌డౌన్ బ్యాటర్ మరిజానే కాప్ మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసింది. భారత బౌలర్లపై నిర్దయాత్మకంగా విరుచుకుపడిన ఆమె కేవలం 45 బంతుల్లోనే 7 ఫోర్లు, 4 భారీ సిక్సర్ల సాయంతో అజేయంగా 81 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చింది. దీనితో దక్షిణాఫ్రికా జట్టు 19.1 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి 161 పరుగులు చేసి ఘనవిజయం సాధించింది.

**మ్యాచ్ ఫలితం, పాయింట్ల పట్టిక ప్రభావం..**

ఈ ఓటమితో భారత జట్టు సెమీఫైనల్ అవకాశాలకు స్వల్ప బ్రేక్ పడినట్లయింది. చేతిలో వికెట్లు ఉన్నప్పటికీ మధ్య ఓవర్లలో భారత బ్యాటర్లు పరుగులు రాబట్టడంలో నెమ్మదించడం, మరిజానే కాప్ ఇచ్చిన క్యాచ్‌లను జారవిడవడం భారత్ ఓటమికి ప్రధాన కారణాలుగా మారాయి. ఆఖరి ఓవర్లలో ఒత్తిడిని జయించడంలో దక్షిణాఫ్రికా చూపిన తెగువ వారిని విజయపథంలో నడిపించింది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com